
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.0
కనిష్ఠం 22.0
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 2 సెప్టెంబరు 2025



ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586 (300.3200)	3,27,953	3,27,953
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.70 (4.12)	4,934.84	5,705.84
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	169.814 (38.0890)	3,01,928	2,76,986

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు	లైవ్ : రూ.120	డ్రెస్ : రూ.170	స్కిన్‌లెస్ : రూ.200



విడమనూరులో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

యూరియా నిల్వలు నిల్

- వచ్చిన ఎరువులు వచ్చినట్టే పంపిణీ
- 1న 680 మెట్రిక్ టన్నుల సరఫరా
- నేడు మరో 1,000టన్నుల దిగుమతి
- ఎరువుల కొరతతో రోడ్డెక్కుతున్న రైతులు

జిల్లాలో ఎన్నడూ లేని విధంగా వానాకాలం సీజన్‌లో యూరియా కొరత తీవ్రంగా ఉంది. జిల్లాలో ఈ సీజన్‌లో మొదటి సారిగా గోదాముల్లో యూరియా నిల్వలు లేకుండా పోయాయి. గతంలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉండేవి. కేంద్రం నుంచి యూరియా సరఫరా అరకొరగా ఉండటం వల్లే ఈ సమస్య ఏర్పడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా, యూరియా కొరతతో రైతులు నిత్యం ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

జిల్లాకు దిగుమతి అయిన యూరియా వచ్చింది వచ్చినట్టే పంపిణీ అవుతోంది. యూరియా వచ్చిందని తెలియగానే రైతులు పీఏసీఎస్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. చెప్పులు, రాళ్ల,ఆధార్ జిరాక్స్‌లు, పాస్‌పుస్తకాల జిరాక్స్‌లను క్యూలైన్‌లోపెడుతూ బస్తాయూరియా కోసం గంటల తరబడి పడిగాపులు పడుతున్నారు. సోమవారం జిల్లాలో 680మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీచేశారు. మండలానికి 20 మెట్రిక్ టన్నులు మాత్రమే అధికారులు సరఫరా చేశారు. ఈ నెల 2న జిల్లాకు 1,000టన్నుల యూరియా రానుండగా, 5న మరో 1,000టన్నులు, 10వ తేదీ నాటికి మరో 4వేల మెట్రిక్ టన్నుల యూరియాను దిగుమతి చేసుకునేందుకు వ్యవసాయశాఖ ప్రయత్నాలు చేస్తోంది. కేంద్రం నుంచి యూరియా సకాలంలో వచ్చి ఉంటే జిల్లాలో ఈ పరిస్థితులు తలెత్తివి కావని పలువురు పేర్కొంటున్నారు. సోమవారం యూరియా కోసం నిడమనూరులో రైతులు రెండు గంటల పాటు రాస్తారోకో చేశారు. హాలియా, తిప్పర్తి, పీఏపల్లి, శాలిగౌరారం, కట్టంగూరు మండలాల్లో రైతులు యూరియా కోసం పడిగాపులు కాశారు. డిండి మండలంలో కూడా యూరియా కొరత తీవ్రంగా ఉంది.

పత్తికి తగ్గిన వాడకం, వరికి పెరిగిన అవసరం

జిల్లాలో పత్తిచేలు ప్రస్తుతం గూడ, కాత దశకు చేరుకున్నాయి. దీంతో పత్తికి యూరియా వాడకం తగ్గగా వరికి యూరియా అవసరం పెరిగింది. సాగర్ ఆయకట్టుతో పాటు బోరుబావుల కింద వరినాట్లు ముమ్మరం కావడంతో యూరియాను పెద్ద మొత్తంలో రైతులు వినియోగిస్తున్నారు. దీంతో వ్యవసాయ శాఖ ఎప్పటికప్పుడు యూరియా ఇండెంట్ పెడుతూ దిగుమతి చేసుకుంటోంది. ఈ మాసానికి 18వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంది. డిమాండ్‌కు తగినంతగా యూరియా దిగుమతి రాకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా కొరతతో పంటల దిగుబడిపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం పంటల విస్తీర్ణం 11,60,389 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. గత వానాకాలంలో 11,50,556 ఎకరాల్లో పంటలు సాగుకాగా, ఈ ఏడాది అదనంగా 10వేల ఎకరాలకు పైగా పంటల విస్తీర్ణం పెరిగింది. ఈ ఏడాది వానాకాలంలో 5,47,735 ఎకరాల్లో పతి సాగు కాగా, వరి 5,25,350ఎకరాల్లో సాగైంది. కందులు 10వేల ఎకరాల్లో, ఇతర మెట్ట పంటలను సైతం రైతులు సాగు చేశారు. ప్రధానంగా ఇటీవల వర్షాలు కురియడంతో వరినాట్లు

- మిగతా 8వ పేజీలో...

నేడు మరో 1,000టన్నుల యూరియా సరఫరా చేస్తాం



జిల్లాలో రైతులకు ఇబ్బందులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడూ యూరియాను పంపిణీ చేస్తోంది. సోమవారం 680 మెట్రిక్ టన్నులను రైతులకు సరఫరా చేశాం. 2న జిల్లాకు మరో 1,000టన్నులు రానుంది. ప్రతీ మండలంలో రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియాను అందుబాటులో ఉంచుతున్నాం. సోమవారం ప్రతీ మండలంలో 20టన్నుల యూరియాను అందుబాటులో ఉంచాం. ఈ నెల 5న మరో 1,000టన్నులు రానుండగా, 10వ తేదీ వరకు 4వేల మెట్రిక్ టన్నుల యూరియాను దిగుమతి చేసుకుంటాం. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

- పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ

సీపీఎస్ రద్దుచేయాలి



కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు సోమవారం పెన్షన్ విద్రోహ దినాన్ని నిర్వహించారు. 8

కుట్రను తిప్పి కొట్టాలి



కాళేశ్వరం ప్రాజెక్టుపై లేనిపోని ఆరోపణలు చేస్తూ కేసును సీబీఐకి అప్పగించడంపై బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. 8

‘ప్రజావాణి’ ఫిర్యాదులను పరిష్కరించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ‘ప్రజావాణి’లో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. మొత్తం 99 ఫిర్యాదులు రాగా, అందులో రెవెన్యూశాఖకు చెందిన ఫిర్యాదులు 69 ఉన్నాయి. ‘ప్రజావాణి’ అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. వీధి కుక్కల సమస్య ఎక్కువగా ఉన్నందున వాటి నివారణకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవోలు వెంటనే పంచాయతీ కార్యదర్శులతో ఈ విషయంపై సమావేశం నిర్వహించాలన్నారు. ప్రత్యేక అధికారులు హాస్టళ్లు, పాఠశాలలు తనిఖీ చేయాలన్నారు. ప్రత్యేక అధికారులు మండలాలను సందర్శించినప్పుడు ఏదైనా చిన్న పనులకు నిధులు మంజూరు చేయాల్సి వస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ధర్తి అబా జనజాతీయ యోజన కింద చేపట్టిన యూనిట్ల గ్రౌండింగ్ తదితర అంశాలను కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామరావు, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

టీబీని గుర్తించే పరికరాల అందజేత: టీబీని గుర్తించే రూ.20లక్షల విలువైన పరికరాలను సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఎస్‌వో వెంకటేష్, పౌరసరఫరాల డీఎం హరీష్, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి నారాయణ, ప్రధాన కార్యదర్శి రేపాల భద్రాద్రి, మిర్యాలగూడ అసోసియేషన్ అధ్యక్షుడు గౌడ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలపై విస్తృత ప్రచారం కల్పించాలి: వీధి కుక్కలపై పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారం కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. పాఠశాల విద్యార్థులకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. వీధి కుక్కల స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్, దత్తత వంటి అంశాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, డీఈవో భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖను మరింత చేరువచేస్తాం

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 54మంది ఫిర్యాదులు తీసుకొని వారితో మాట్లాడారు. బాధితుల సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి వినతులు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

విధుల్లోకి వెళ్లే ముందు .. 6

మొబైల్ ఇవ్వాల్సిందే

మిర్యాలగూడ డిపోలో అమలులోకి వచ్చిన పైలట్ ప్రాజెక్ట్

నష్టం అంచనాలు రూపొందించాలి

వీడియోకాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కలిగిన నష్టం అంచనాలు రూపొందించి అందజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారు. ప్రకృతి విపత్తుల ద్వారా జరిగిన నష్టాలపై వేగవంతంగా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖలకు చెందిన రోడ్లు తెగాయని, లోలెవల్ కాజ్‌వేలు, కల్వర్టులు, ఇరిగేషన్ మైనర్, మేజర్ ప్రాజెక్టుల చెరువు కట్టలు దెబ్బతిన్నాయన్నారు. వాటిని అధికారులు గుర్తించి మరమ్మతులు చేయాలన్నారు. వరద నష్టంపై పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, వ్యవసాయ, విద్యుత్, ఇరిగేషన్ శాఖలు వేగవంతంగా నివేదికలు సమర్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పాల్గొన్న జిల్లా అధికారులు

అధికారులు నివేదికలు రూపొందించాలి

వర్షంతో జిల్లాలో జరిగిన నష్టంపై అధికారులు నివేదికలు రూపొందించి అందజేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. జిల్లాలో ఇటీవల భారీ వర్షాలకు ఆర్అండ్‌బీ రహదారులు మాత్రమే దెబ్బతిన్నాయని, నష్టం అంచనా వివరాలను వెంటనే తయారుచేసి సమర్పించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్, మునిసిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను పూర్తి చేయాలి

నల్లగొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలను త్వరగా పూర్తిచేయాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి విమల అన్నారు. సోమవారం డీసీఈబీ కార్యదర్శి కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘాల అధ్యక్షుల ఉమ్మడి సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు ముందుగా నియోజకవర్గస్థాయి పోటీలు పూర్తిచేయాల్సి ఉందన్నారు. డీఈవో ఆదేశాల మేరకు ఆరు నియోజక వర్గాలకు కన్వీనర్లను నియమించామన్నారు. నల్లగొండ కన్వీనర్‌గా వీసం రాజు, నకిరేకల్‌కు నంద్యాల నర్సింహారెడ్డి, తిరిమలగిరి (సాగర్)కు మైలారిశెట్టి సత్యనారాయణ, మిర్యాలగూడకు బోయపల్లి శోభారాణి, దేవరకొండకు ఇటుకపాటి జయమ్మ, మర్రిగూడకు పాల్తిచిన జంగయ్యను నియమించినట్టు తెలిపారు. వీరి ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి విమల

బీఫార్మసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయాలి

హెచ్ఆర్‌సీ చైర్మన్ షమీమ్ అక్తర్ ఆదేశాలు

నల్లగొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణ సమీపంలోని చర్లపల్లి నలంద కళాశాలలో బీఫార్మసీ పూర్తి చేసిన 16 మంది విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను, టీసీలను తక్షణమే ఇవ్వాలని మానవ హక్కుల సంఘం చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఆదేశాలు జారీ చేశారు. కొద్ది రోజుల క్రితం బీఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులు నలంద కళాశాల యాజమాన్యంపై హెచ్ఆర్‌సీకి ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందని సర్టిఫికెట్లు ఇవ్వకుండా నిరాకరించడం రాజ్యాంగబద్ధమైన మౌలిక హక్కుల ఉల్లంఘన అని ఉత్తర్వుల్లో ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్-21 కింద హక్కుల ఉల్లంఘనగా కమిషన్ గుర్తించిందని, విద్యను మౌలిక మానవ హక్కుగా పరిగణిస్తూ విద్యార్థులకు తక్షణమే సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆదేశించారు. అదేవిధంగా కళాశాల చైర్మన్, డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఈనెల 8వ తేదీన కమిషన్ ఎదుట హాజరుకావాలని ఆదేశించారు.

రైతులకు సరిపడా యూరియా

జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్

కట్టంగూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్‌కుమార్ తెలిపారు. సోమవారం కట్టంగూర్ పీఏసీఎస్ వద్ద యూరియా పంపిణీని పరిశీలించి స్టాక్ వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు అవసరం మేరకే యూరియా కొనుగోలు చేసి వినియోగించాలని సూచించారు. జిల్లాకు 70వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ఇప్పటి వరకు 51వేల మెట్రిక్ టన్నుల వచ్చిందని, ఆ మొత్తాన్ని రైతులకు పంపిణీ చేశామన్నారు. జిల్లాకు 19వేల మెట్రిక్ టన్నుల యూరియా ఇంకా రావలసి ఉందన్నారు. ఈ నెల 2న మరో 1,300 టన్నుల యూరియా జిల్లాకు వస్తుందని తెలిపారు. పంపిణీ కేంద్రాల వద్ద రైతులు అధికారులకు సహకరించాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి గిరిప్రసాద్, పీఏసీఎస్ సీఈవో బండ మల్లారెడ్డి, ఏఈవో నవీన్, తదితరులు ఉన్నారు.



కట్టంగూరులో యూరియా స్టాక్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్

సృజనాత్మకత పెంపుదలకు

సదస్సులు దోహదం

ఎంజీయూ వీసీ అల్తాఫ్‌హుస్సేన్

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపుదలకు సదస్సులు దోహదపడుతాయని ఎంజీయూ ఉపకులపతి ఆచార్య అల్తాఫ్‌హుస్సేన్ అన్నారు. ‘డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య సాహిత్యం -సమాలోచన’ అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఎంజీయూలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సాహిత్య అకాడమి సౌజన్యంతో రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్యార్థుల్లో సాహిత్యంపై ఆసక్తిని, స్ఫూర్తిని ఇస్తామన్నారు. సదస్సు రాహత్‌ఖానమ్, డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, వైస్‌ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, జె.చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంజీయూ వీసీ అల్తాఫ్‌హుస్సేన్

వేదాంత భజన మందిర వినాయకుడు

@ 74 ఏళ్లు

● మొదటి నుంచి మట్టి విగ్రహాల ఏర్పాటు ప్రత్యేకం

● ఇక్కడి లడ్డూకు ఎంతో పోటీ

వినాయక విగ్రహం అనగానే ఎత్తుతో పాటు దశాబ్దాలుగా ప్రతిష్ఠిస్తున్న ఖైరతాబాద్ వినాయకుడే గుర్తుకు వస్తారు. కానీ అంతకు ముందు నుంచే సూర్యాపేట జిల్లా కేంద్రంలో బొడ్రాయి బజార్‌లోని శ్రీసీతారామచంద్రుల వేదాంత భజన మందిరంలో వినాయక ప్రతిమను నెలకొల్పుతూ గణేష్ నవరాత్రోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాలకు ఈ ఏడాదికి 74 ఏళ్లు. ఈ ప్రాంతంలో ఇదే మొట్టమొదటి విగ్రహం.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)



ఈ ఏడాది వేదాంత భజనమందిరంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడు

సూర్యాపేటలోని బొడ్రాయిబజార్ వ్యాపార సముదాయంగా ఉంటుంది. 1950లో శ్రీసీతారామచంద్రుల స్వామి దేవాలయాన్ని నిర్మించారు. ఈ దేవాలయం వేదాంత భజన మందిరంగా ప్రజలకు సుపరిచితం. అయితే 1951లో వెంపటి లక్ష్మీనర్సయ్య, వెంపటి సదానందం అడుగు ఎత్తులోని మట్టి వినాయకుడిని నవరాత్రోత్సవాల సందర్భంగా మొదటిసారి ఏర్పాటుచేశారు. నాటి నుంచి నేటి వరకు ప్రతీ ఏడాది ఎలాంటి ఆటంకాలు లేకుండా వేడుకలు నిర్వహిస్తున్నారు. మొదట్లో చుట్టుపక్కల ఉన్న వ్యాపారులు, స్థానికులు కలిసి చెందాలు లేకుండా వినాయకుడి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అయితే 1984, 1985లో మాత్రం పీవోపీ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. తిరిగి యథావిధిగా మట్టి విగ్రహాలనే ఏర్పాటుచేస్తున్నారు. కరోనా సమయంలో సైతం ఉత్సవాలు ఆగలేదు. సుమారు 6నుంచి 7అడుగుల వరకు మాత్రమే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుంటారు.

లడ్డూ కోసం పోటీ

వేదాంత భజనమందిరం వినాయక శోభాయాత్ర దేవాలయం నుంచి సద్దుల చెరువు కట్ట వరకు సుమారు 4 నుంచి ఐదు కిలోమీటర్ల శోభాయాత్రలో పార్టీలకతీతంగా అందరూ పాల్గొంటారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్, పూలసెంటర్‌లలో శోభాయాత్రలో భాగంగా బానుపురి గణేష్ ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో లడ్డూ వేలంపాట నిర్వహిస్తారు. పట్టణ ప్రజలందరూ అక్కడికి రావడంతో పాటు జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన అన్నివిగ్రహాల లడ్డూ వేలంపాట అక్కడే నిర్వహిస్తుంటారు. దీంతో వేదాంత భజన మందిరం లడ్డూ వేలం పాట సైతం అక్కడే నిర్వహిస్తారు. ఈ లడ్డూ కోసం భక్తులు పోటీపడుతుంటారు. వేలంపాటలో గత ఏడాది రూ.1.25 లక్షలు పలికింది. అంతకు ముందు ఏడాది రూ.1.55 లక్షలు పలికింది. లడ్డూను దక్కించుకోవడం అదృష్టంగా భావిస్తారు. ఇక్కడి వినాయకుడి శోభాయాత్రలో ప్రజాప్రతినిధులు పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. కొన్నేళ్లుగా ఎమ్మెల్యేలు స్వయంగా వినాయకుడి శోభాయాత్ర వాహనాలను నడుపుతూ నిమజ్జనంలో పాల్గొంటున్నారు.

వినాయకుడికి పూజలు నా అదృష్టం



74 ఏళ్ల చరిత్ర కలిగిన వేదాంత భజన మందిరం వినాయకుడికి గత 45 ఏళ్లుగా పూజలు చేయడం నా అదృష్టంగా భావిస్తున్నా. దాదాపు మట్టి విగ్రహాన్నే ఏర్పాటు చేస్తున్నాం. శోభాయాత్ర అంగరంగవైభవంగా చేపడతాం. కరోనా సమయంలో సైతం వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు చేశాం.

దరూరి సింగరాచార్యులు, పూజారి

లంబోదరుడికి లక్ష ఉండ్రాళ్లు



తిరుమలగిరి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గణేష్ నవరాత్రి ఉత్సవాలను సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం పట్టణంలోని క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద స్వామివారికి మహిళా భక్తులు లక్ష ఉండ్రాళ్ల ప్రసాదం నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో నిర్వాహణ కమిటీ సభ్యులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాపాక సోమేష్, గజ్జి ఉపేందర్, తిప్పిరిశెట్టి లక్ష్మణ్, గబ్బెట సంపత్‌కుమార్, బుక్క శ్రీనివాస్, మూల వెంకట్‌రెడ్డి, జైన్ వీరప్రసాద్, డిడిగం శ్రీధర్, మహిళా భక్తులు పాల్గొన్నారు.

ఆందోళనలో మహిళా ఏఈవోలు!

● సూర్యాపేట జిల్లాలో 60 ఏఈవోల పోస్టులు ఖాళీ

● ఉన్న వారిపై తీవ్ర పనిఒత్తిడి

సూర్యాపేట జిల్లాలో మండల వ్యవసాయాధికారుల తీరు చర్చనీయాంశమైంది. మహిళా ఏఈవోలను వేధింపులకు గురిచేస్తూ తుంగతుర్తి డివిజన్‌లో ఇద్దరు ఏవోలు సస్పెండ్‌కు గురయ్యారు. ఈ ఉదంతం మహిళా ఏఈవోల ఇబ్బందులను వెలుగులోకి తెచ్చింది. వేధింపులు తట్టుకోలేకపోతున్నట్లు పలువురు మహిళా ఏఈవోలు ఆవేదన చెందుతున్నారు. అయితే బహిరంగంగా చెప్పుకోవడానికి జంకుతున్నారు. సక్రమంగా విధులు నిర్వహిస్తున్నా ఏదో వంకతో మండల స్థాయి అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి-భానుపురి)



తుంగతుర్తి డివిజన్‌లోని తుంగతుర్తి ఏవో బాలకృష్ణ, నూతనకల్ ఏవో మురళీబాబులు మహిళా ఏఈవోలో అసభ్యంగా ప్రవర్తించడంతో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ సస్పెన్షన్ వేటు వేశారు. ఈ ఘటనపై ఐదుగురు అధికారులతో కూడిన కమిటీని వేశారు. ఈ కమిటీ మహిళా ఉద్యోగుల నుంచి వివరాలను సేకరించి కలెక్టర్‌కు అందజేసింది. దీంతో వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే విధులకు దూరప్రాంతాలకు వెళ్లే ఏఈవోలు ఒంటరిగా వెళ్లడానికి సైతం జంకుతున్నారు. సూర్యాపేట జిల్లాలో 84 మంది ఏఈవోలు ఉండగా అందులో 53 మంది మహిళా ఏఈవోలు ఉన్నారు. వ్యవసాయ శాఖలో ఎక్కువ మంది మహిళలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. పర్మినెంట్ ఉద్యోగులతో పాటు 14మంది వరకు అవుట్‌సోర్సింగ్ ఏఈవోలు సైతం ఉన్నారు. వీరిపై మండల నుంచి పైఅధికారుల వరకు పనిభారం పెంచుతూ పెత్తనం చెలాయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పని ఒత్తిడిలో ఏఈవోలు

నిబంధనల ప్రకారం ఒక్కో ఏఈవోకు 5 వేల ఎకరాలకు ఒక ఏఈవో ఉండాలి. అయితే సూర్యాపేట జిల్లాలో 60 ఏఈవో పోస్టులు ఖాళీలు ఉండడంతో వివిధ చోట్ల అదనంగా బాధ్యతలు అప్పగించారు. కొన్నిచోట్ల ఒక్కొక్క ఏఈవోకు 7 నుంచి 8 వేల ఎకరాల వరకు వ్యవసాయ భూములను కేటాయించారు. పని ఒత్తిడిలో ఎక్కడో ఒకచోట తప్పులను చూపి పైస్థాయి అధికారులు వేధింపులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వానాకాలం, యాసంగి సీజన్‌లలో ఐకేపీ, పీఏసీఎస్, ఎన్‌డీసీఎంఎస్, మార్కెట్లలో రైతులు తీసుకువచ్చిన ధాన్యం తేమశాతం ప్రధానంగా చూడాల్సి ఉంటుంది.

అయితే ఒక్కొక్కరికీ నాలుగు నుంచి ఐదు కేంద్రాలను కేటాయించడంతో మహిళా ఏఈవోలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏఈవోలు సాధారణంగా పంటల వివరాలు సేకరించడం, రైతు బీమా, రైతుబంధు లాంటి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసే బాధ్యతలు చేపడుతున్నారు. అదేవిధంగా రైతులు వేసిన పంటల వివరాలు ఇలాంటివి చూడాల్సి ఉంది. ఒక్కొక్కరిపై పనిఒత్తిడి రెండింతలు ఉన్నట్లు మహిళా ఏఈవోలు తెలిపారు.

మహిళా ఏఈవోలు భయపడాల్సిన అవసరం లేదు

మహిళలు భయపడాల్సిన అవసరం లేదు. కలెక్టరేట్‌లో ఉమెన్ సెల్లార్ కమిటీ విభాగం ఉంది. అక్కడ ఫిర్యాదు చేసుకోవచ్చు. ఇతర ప్రాంతాల్లో ఏఈవోలకు ఇబ్బంది ఉన్నట్లు తమ దృష్టికి రాలేదు. ఐదుగురితో కూడిన మహిళా కమిటీని కలెక్టర్ నియమించడంతో విచారణ చేపట్టడంతో ఇద్దరు ఏవోలపై సస్పెన్షన్ వేటుపడింది.

శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

మహిళ మృతికి కారకులైన మరో ముగ్గురు అరెస్ట్

సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అబార్షన్ ఆపరేషన్ వికటించి మహిళ మృతి చెందిన కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట జిల్లా సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. సోమవారం సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మోతె మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన బయ్య అనూష-నగేష్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉండగా, మరోసారి అనూష గర్భం దాల్చింది. ఐదో నెల నిండగానే పుట్టబోయేది ఆడపిల్లనా లేక మగ పిల్లవాడా అని తెలుసుకోవాలని భావించారు. అందులో భాగంగా మే 18న అనూష బంధువు సాయంతో సూర్యాపేట మండలంలోని టేకుమట్ల గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ జానయ్యను సంప్రదించారు. ఆయన సూచనతో నకిరేకల్‌లోని ఓ స్కానింగ్ కేంద్రానికి అనూషను తీసుకెళ్లారు. అక్కడ ఆమెను పరీక్షించిన అనంతరం పుట్టబోయేది ఆడపిల్ల అని తేలడంతో అబార్షన్ చేయించాలని నిర్ణయించుకున్నారు. దీంతో మరికొందరు ఆర్‌ఎంపీల సాయంతో సూర్యాపేటలోని ఒమెగా ఆస్పత్రిలో అబార్షన్ చేశారు. ఆ సమయంలో వైద్యం వికటించి అధిక రక్తస్రావమైంది. దీంతో అనూషను ఖమ్మం తీసుకెళ్లారు. అక్కడ మే 21న అనూష మృతి చెందింది. ఈ విషయమై అప్పటి డీఎంహెచ్‌వో డాక్టర్ కోటా చలం ఫిర్యాదు మేరకు సూర్యాపేట ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు గోరెంట్ల సంజీవ, వీరబోయిన వేణు, నకిరేకల్‌లో స్కానింగ్ చేసిన బాత్క యాదగిరి, ఆర్‌ఎంపీ జాల జానయ్య, ఖమ్మం జిల్లా కూసుమంచికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ నాగరాజు, అర్వపల్లికి చెందిన ఆర్‌ఎంపీ చౌగోని గణేష్, ఆస్పత్రిలో పనిచేసే సూర్యాపేటకు చెందిన పిడమర్తి శోభ, మోతె మండలం సర్వారం గ్రామానికి చెందిన మృతురాలు అనూష బంధువు ఉప్పల సందీప్, అనూష భర్త నగేష్, నాగారం మండలం వర్ధమానుకోట గ్రామానికి చెందిన తొట్ల గణేష్‌పై కేసు నమోదుచేశారు. కాగా ఇప్పటివరకు గణేష్, సందీప్, తొట్ల గణేష్, బాత్క యాదగిరిలను ఇదివరకే అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కాగా సోమవారం ఉదయం విశ్వసనీయ సమాచారం మేరకు గోరెంట్ల సంజీవ, జాల జానయ్య, వీరబోయిన వేణు పట్టణంలోని రాజీవ్‌పార్క్ సమీపంలోని ఓ హోటల్ వద్ద ఉన్నట్లు తెలియడంతో అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం కోర్టుకు రిమాండ్‌కు తరలించామన్నారు. కేసులో ఇంకా అరెస్ట్ కాకుండా పరారీలో ఉన్న వారిని కూడా త్వరలోనే పట్టుకుని రిమాండ్ చేస్తామన్నారు. సమావేశంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఎస్‌ఐ ఏడుకొండల్, సిబ్బంది గొర్ల క్రిష్ణయ్య, వీరయ్య, గోదేశి కర్ణాకర్, జోగు సైదులు, జానీ ఉన్నారు.



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్

గోపాలపురంలో భారీ చోరీ

● 11 తులాల బంగారం, 20 తులాల వెండి, 5 లక్షల నగదు అపహరణ

హుజూర్‌నగర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం గోపాలపురంలో భారీ చోరీ జరిగింది. ఎస్‌ఐ బండి మోహన్‌బాబు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోపాలపురం గ్రామానికి చెందిన పేరూరి భాగ్యరాజు పనినిమిత్తం మూడు రోజుల కిందట భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలోని యర్రగుంటకు వెళ్లాడు. సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి తిరిగివచ్చే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉండటం, ఇంట్లో వస్తువులు చిందరవందర ఉండటంతో లోపలికి వెళ్లి పరిశీలించాడు. దొంగలు 11 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి, రూ.5 లక్షల నగదు చోరీ చేసినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు క్లూస్‌టీంతో వెళ్లి ఆధారాలు సేకరించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా గోపాలపురంలో ఇంత పెద్ద మొత్తంలో నగదు, బంగారం, వెండి వస్తువులు చోరీకి గురవడం సంచలనంగా మారింది. రెండు నెలలుగా గ్రామంలో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయంపై అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చోరీలకు నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరారు.

నిలిపిఉంచిన ట్రాక్టర్ ట్రక్కును ఢీకొన్న ద్విచక్రవాహనం

మఠంపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బిర్యానీ తెచ్చుకునేందుకు ఇద్దరు స్నేహితులతో కలిసి వెళ్లిన పదవ తరగతి విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. సోమవారం కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇదే గ్రామానికి చెందిన కొత్తపల్లి గౌతమ్(17) మఠంపల్లి మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్నారు. ఇదే గ్రామానికి చెందిన అతడి స్నేహితులు గుండెబోయిన పవన్, ఎం.నవీన్‌తో కలిసి మఠంపల్లికి వెళ్లి బిర్యానీ తీసుకువద్దామని ద్విచక్ర వాహనంపై వెళ్లారు. బిర్యానీ తీసుకొని తిరిగి స్వగ్రామం చౌటపల్లికి వెళ్తుండగా గ్రామసమీపంలోని నాపరాళ్ల మిల్లు వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రక్కును వెనుక నుంచి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గౌతమ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పవన్‌కు తీవ్రగాయం కావడంతో 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియ ఆస్పత్రికి తరలించి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం పట్టణానికి తరలించారు. మరో స్నేహితుడు నవీన్‌కు స్వల్ప గాయం కావడంతో హుజూర్‌నగర్‌లో చికిత్స అందిస్తున్నారు. హుజూర్‌నగర్‌కు చెందిన ట్రాక్టర్‌పై గణేష్ విగ్రహాన్ని మట్టపల్లి కృష్ణానదిలో నిమజ్జనం చేసి తిరిగి వెళ్తుండగా డీజిల్ అయిపోవడంతో చౌటపల్లి గ్రామసమీపంలోని నాపరాళ్ల మిల్లు వద్ద రోడ్డు పక్కనే నిలిపి ఉంచారు. గౌతమ్ తండ్రి కొన్నేళ్ల కిందట చనిపోగా తల్లి నాగమణి ఉంది. ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో తల్లి నాగమణి రోదన చూసి ప్రతి ఒక్కరూ కంటనీరు పెట్టుకున్నారు. గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందడం, మరో ఇద్దరికి గాయాలు కావడంతో చౌటపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



గౌతమ్(ఫైల్)

ఎక్స్‌కవేటర్ పట్టివేత, కేసు నమోదు

కనగల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని పగిడిమర్రి గ్రామ వాగు ఇసుక రీచ్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న ఎక్స్‌కవేటర్(జేసీబీ) వాహనాన్ని సీజ్ చేసినట్లు రాజీవ్‌రెడ్డి తెలిపారు. సదరు ఎక్స్‌కవేటర్ యజమాని కదిరె మహేష్, డ్రైవర్ రాజేష్ ఇరువురిపై కేసు నమోదు చేసి వాహనాన్ని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా చేసే వారి సమాచారాన్ని పోలీసులకు తెలియపర్చాలని ప్రజలకు సూచించారు.



తల్లిదండ్రులకు పోషణ ఖర్చులు చెల్లించాలి



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న కుమారులు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల పోషణ ఖర్చులు చెల్లించాలని ఆర్డీవో నేతృత్వంలోని ట్రిబ్యునల్ కుమారులను ఆదేశించింది. యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రం భువనగిరి పట్టణానికి చెందిన వృద్ధ దంపతులు మంద యాదగిరి, వసంత జీవనం ఇబ్బందిగా మారడంతో కుమారులు తమను పట్టించుకోవడం లేదని జూన్ 26న ఆర్డీవో నేతృత్వంలోని ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ట్రిబ్యునల్ విచారణ జరిపి ముగ్గురు కుమారులు కలిసి నెలకు రూ.7వేలు తల్లిదండ్రులకు ఇవ్వాలని సోమవారం ఆదేశించింది. దీంతో ట్రిబ్యునల్ ఆశ్రయించేందుకు వృద్ధ దంపతులకు సహకరించిన తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో కుమారులచే తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పించి పాద పూజ చేయించారు. నెలవారీగా పోషణ ఖర్చులను చెల్లించడాన్ని విస్మరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రగుంట వెంకటేశం, దర్గాయి నర్సింగరావు, పాల్గొన్నారు.

కుటుంబపోషణ భారమై ఆత్మహత్య

మర్రిగూడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణ భారమై వ్యక్తి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ కృష్ణారెడ్డి, మృతుని భార్య తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చెందిన జంపాల తిరుపతి(47) కుటుంబ పోషణ భారమై ఇబ్బందులకు గురవుతున్నాడు. వృత్తిరీత్యా నాయీబ్రాహ్మణ దుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబ పోషణ కష్టంగా మారడంతో మనస్తాపానికి గురై సోమవారం రాత్రి తన దుకాణంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. తిరుపతి భార్య జంపాల విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోసం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. తిరుపతికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు

అనుమానాస్పదస్థితిలో కార్మికుడి మృతి

వలిగొండ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో మత్స్య కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిలాళ్ల వలిగొండ మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోకారం గ్రామానికి చెందిన చెర్క శ్రీను(35) మత్స్య కార్మికుడు. ఆదివారం ఆ గ్రామ చేపల చెరువు కాపలా కోసం గ్రామస్థులు చెర్క విక్రమ్, యాదగిరిలతో కలిసి చెరువు వద్దకు వెళ్లాడు. తాను చెరువు చుట్టూ తిరగలేనని ఓ చోట కూర్చున్నాడు. తోటి గ్రామస్థులు చెరువు చుట్టూ తిరిగి వచ్చి చూసేసరికి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకోగా అప్పటికే అతను మృతి చెందినట్లు గమనించారు. అతని శరీరంపై ఎటువంటి గాయాలు కనబడలేదు. శ్రీను తల్లి గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిట్యాల ఉన్నత పాఠశాలలో విచారణ

చిట్యాల, సెప్టెంబరు 1,(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో ఎఫ్ఏసీ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన గోగికార్ మాధవి పీఎంశ్రీ నిధులు దుర్వినియోగం చేశారని వచ్చిన ఆరోపణలపై సోమవారం పాఠశాలలో విచారణ చేపట్టారు. జిల్లా ఫైనాన్షియల్ అకౌంట్స్ ఆఫీసర్ సీహెచ్ యోగేంద్రనాథ్, స్థానిక ఎంఈవో పోనుగోతు సైదానాయక్‌తో కలిసి విచారణ చేపట్టారు. పీఎంశ్రీ నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకొని అందుకు సంబంధించిన రశీదు ఇవ్వబోగా హెచ్ఎం నిరాకరించారు. స్వాధీనం చేసుకున్న రికార్డులను లాక్కోవడానికి ప్రయత్నించినట్లు తెలిసింది. దీనికి సంబంధించి ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నాయి.

విధుల్లోకి వెళ్లే ముందు ..

మొబైల్ ఇవ్వాల్సిందే!

● సోమవారం నుంచే అమలు

● పైలెట్ ప్రాజెక్టుగా మిర్యాలగూడ డిపోలో అమలు

మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ సెమీలగ్జరీ బస్‌డ్రైవర్ ఆరు నిమిషాలు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తుండగా ఓ ప్రయాణికుడు వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్ట్‌చేశాడు. మిర్యాలగూడ నుంచి దేవరకొండకు వెళ్తున్న ఆర్టీసీ అద్దెబస్ డ్రైవర్ ఏకంగా రీల్స్ చూస్తుండడాన్ని పసిగట్టిన ప్రయాణికుడు అతడితో వాగ్వాదానికి దిగగా, మిగతా ప్రయాణికులందరూ కలిసి డ్రైవర్ చేతిలో సెల్‌ఫోన్ లాక్కున్నారు. ఇలాంటి ఘటనలకు ఆర్టీసీ సంస్థ యజమాన్యం చెక్‌పెట్టింది. డ్రైవర్ చేతిలో సెల్ ఫోన్ ఉండకూడదని యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది.

(ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ టౌన్)



మిర్యాలగూడలో సెక్యూరిటీ అధికారికి సెల్ ఫోన్ అందజేస్తున్న ఆర్టీసీ డ్రైవర్

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలనే లక్ష్యంతో ఆర్టీసీ సంస్థ డ్రైవర్లకు సెల్‌ఫోన్ నిషేధం విధించింది. ఆర్టీసీ రథసారధులు కొన్నిసందర్భాల్లో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తుండటంతో ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయి. ఈ క్రమంలో డ్రైవర్లు విధులకు వెళ్లేముందు సెల్‌ఫోన్లను డిపోలోని సెక్యూరిటీ విభాగంలో డిపాజిట్ చేసి, డ్యూటీ దిగిన అనంతరం తీసుకోవాలంటూ యజమాన్యం ఆదేశాలు జారీ చేసింది.

పైలట్ ప్రాజెక్టుగా..

విధి నిర్వహణలో ఆర్టీసీ డ్రైవర్ల సెల్‌ఫోన్ వినియోగంపై రాష్ట్రవ్యాప్తంగా పక్షం రోజుల పాటు ఆర్టీసీ యాజమాన్యం సర్వే నిర్వహించింది. అనంతరం 11 రీజియన్లలో ఒక్కోడిపోను ఎంపిక చేసి ఆగస్టు 31 నుంచి నూతన విధానం అమలులోకి తెచ్చింది. అన్ని డిపోల డ్రైవర్లు విధినిర్వహణలో సెల్‌ఫోన్ వినియోగిస్తున్నా ఎక్కువమంది డ్రైవర్లు సెల్‌ఫోన్ వినియోగించే డిపోలను యజమాన్యం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి డ్రైవర్లకు సెల్‌ఫోన్‌ను నిషేధించింది.

తీరు మారకపోవడంతోనే..

ఆర్టీసీ, రవాణా శాఖాధికారులు డ్రైవర్లకు పలు అంశాలపై తర్ఫీదు ఇస్తుంటారు. అందులో భాగంగా 'నో సెల్ ఫోన్.. వైల్ డ్రైవింగ్' అనే అంశంపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ డ్రైవర్ల తీరు మారడంలేదు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ర్యాష్‌గా డ్రైవింగ్ చేస్తూ ప్రయాణికులను భయాందోళనలకు గురిచేస్తున్నారు. ఇటీవల నమోదైన ఆర్టీసీ ట్రాఫిక్ ఉల్లంఘన కేసులే అందుకు ఉదాహరణ. ఆరు నెలల్లో 2,314 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదయ్యాయి.


ప్రస్తుతానికి ఈ డిపోల్లో

డ్రైవర్ల సెల్‌ఫోన్ వాడకంపై నిషేధాన్ని రాష్ట్రంలోని 11డిపోల్లో సోమవారం నుంచే అమలైంది. అందులో మిర్యాలగూడ, ఖమ్మం, కూకట్‌పల్లి, సంగారెడ్డి, ఫరూక్‌నగర్, కొల్లాపూర్, వికారాబాద్, జగిత్యాల, ఉట్నూర్, కామారెడ్డి, పరకాల డిపోల్లో తొలివిడతలో సెల్‌ఫోన్ వాడకంపై నిషేధాన్ని అమలుచేస్తున్నారు.

డ్రైవర్లు ఏమంటున్నారంటే

సెల్‌ఫోన్ నిషేధం అమలుపై డ్రైవర్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. తాము సెల్‌ఫోన్ వినియోగించడంలేదని, అత్యవసరమైతే స్టాప్ ఉన్న స్టేషన్లలో ఆగినపుడు మాత్రమే వినియోగిస్తున్నామని పేర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితులు ఉన్నప్పుడు ఫోన్ లేకపోవడంతో ఇబ్బంది కలుగుతుందని మరికొందరు చెబుతున్నారు. ఆన్‌లైన్ కొనుగోళ్లకు సంబంధించి కుటుంబ సభ్యులకు డబ్బులు బదిలీ చేయాల్సి ఉంటుందని ఇక నుంచి ఇబ్బందిగా మారే అవకాశం ఉంటుందన్నారు. సంస్థ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఇబ్బంది కాలేదు



ఈ రోజు సెల్‌ఫోన్ లేకుండా విధులకు హాజరయ్యా. నాకు అంతగా కాల్స్ రావు, అందుకే ఏం ఇబ్బంది కాలేదు. ముందుగానే పనులు చూసుకుని డ్యూటీకి ఎక్కుతాను. గతంలోనైనా డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ వాడలేదు. గమ్యం చేరిన తరువాతే వాడేవాడిని.

ఎన్.ఏడుకొండలు, ఆర్టీసీడ్రైవర్,మిర్యాలగూడ.

చాలా మంచి నిర్ణయం



సెల్‌ఫోన్ చూస్తూ డ్రైవింగ్ చేయడం చాలా ప్రమాదకరం. యాజమాన్య నిర్ణయం చాలా బాగుంది. అన్ని డిపోల్లోనూ అమలు చేయాలి. డ్రైవర్లకు అవగాహన నిర్వహిస్తూనే ఉన్నాం. సెల్‌ఫోన్ వినియోగించకపోవడం, డ్రైవర్ల ఫిట్‌నెస్, కేఎంపీఎల్ పెంచడం తదితర అంశాలపై నిపుణులతో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం.

ఎగ్బాల్, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్, మిర్యాలగూడ

దూర ప్రాంత డ్రైవర్లకు.. నిబంధనల మేరకు..

ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ జారీ చేసే ఆర్టీసీ డ్రైవర్లు, దూర ప్రాంతాలకు వెళ్లే సర్వీస్ డ్రైవర్లకు నిబంధనల మేరకు సెల్‌ఫోన్ అనుమతిస్తామని ఆర్టీసీ ఉన్నతాధికారులు తెలిపారు. కాకినాడ, తిరుపతి, అరుణాచలం, బెంగుళూరు తదితర ప్రాంతాలకు వెళ్లే డ్రైవర్లు కార్పొరేషన్, ప్రయాణికుల సేవల కోసం మాత్రమే సెల్‌ఫోన్ వినియోగించేలా యాజమాన్యం అనుమతి ఇచ్చిందని చెబుతున్నారు.

హరీశ్‌రావు, సంతోష్‌రావు

అవినీతి అనకొండలు

(మొదటిపేజీ తరువాయి)



మీడియా మిత్రులతో రకరకాలుగా చెప్పించారు. సోషల్ మీడియా ద్వారా ఇప్పటివరకు నాపై జరిగిన పర్సనల్ ఎటాక్‌ను ఓర్చుకుంటూ వచ్చాను. ఇంతవరకు పేరు పెట్టి చెప్పలేదు. ఇప్పుడు మొదటిసారి చెబుతున్నా. దేవుడి లాంటి మా నాన్నపై సీబీఐ విచారణ చేస్తామంటుంటే.. ఒక బిడ్డగా కడుపు రగిలిపోతోంది. అందుకే చెబుతున్నా" అని అన్నారు.

ఇంకా వాళ్లనే మోస్తారా?

"హరీశ్‌రావు, సంతోష్.. కేసీఆర్ పక్కన ఉండి, ఆయన పేరు చెప్పుకొని అనేక విధాలుగా లబ్ధి పొందారని కవిత తెలిపారు. వారి చర్యల వల్లే కేసీఆర్ పేరు బద్నామ్ అయ్యే పరిస్థితి వచ్చింది. అయినా వాళ్లనే మోస్తామని, వాళ్లనే మళ్లీ ముందుకు తీసుకెళ్తామని అనుకుంటే.. పార్టీ ఎలా ముందుకుపోతుందని ప్రశ్నించారు. "ఒక బిడ్డగా నేను బాధపడుతున్నా. ఐదేళ్లు ఇరిగేషన్ మంత్రిగా చేసిన హరీశ్‌రావుకు ఇందులో మేజర్ పాత్ర లేదా? మా నాన్న పరిస్థితి నేను దగ్గరుండి చూశాను. నా పెళ్లికి డబ్బుల కోసం ఆయన ఎంత ఇబ్బంది పడ్డారో నాకు తెలుసు. రాజకీయాల్లో 40, 50 ఏళ్లు ఉన్నా.. కేసీఆర్ ఆస్తులు సంపాదించుకోలేదు. నాకు తెలిసి ఆయనకు డబ్బుపై ఎన్నడూ ఆశలేదు. అలాంటి వ్యక్తిపై సీబీఐ విచారణ చేస్తామని, కేసులు వేస్తామని అంటే.. ఇందుకు ఎవరు కారణం? ఈ వయసులో ఆయనపై సీబీఐ కేసులేంటి? ఏం ఖర్మ? ఇలాంటి వాళ్లను ఎందుకు భరించాలి? ఎందుకు ప్రొటెక్ట్ చేయాలి? బీఆర్ఎస్ తమ్ముళ్లకు నాపై కోపం రావచ్చు. వాస్తవాలు చేదుగా ఉన్నా.. మందులాగా అప్పుడప్పుడు మాట్లాడితేనే ఆరోగ్యంగా ఉంటుంది" అని కవిత వ్యాఖ్యానించారు.

హరీశ్, సంతోష్ వెనక రేవంత్‌రెడ్డి..

కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని ప్రభుత్వమని కవిత మండిపడ్డారు. ఏసీబీ మగ్గురు కాళేశ్వరం ఇంజనీర్లను పట్టుకుంటే, ఒక్కో ఇంజనీరు దగ్గర వందల కోట్ల ఆస్తులు బహిర్గతమైతే.. విచారణ చేసే దమ్ము ప్రభుత్వానికి లేకుండాపోయిందని ధ్వజమెత్తారు. వారి వెనకాల ఎవరున్నారని ప్రశ్నించారు. "హరీశ్‌రావు, సంతోష్‌రావు వెనక రేవంత్‌రెడ్డి ఉండి కాపాడుతున్నారు. బాణం గురి ఎంతసేపూ కేసీఆర్‌పైనే ఉంది. అందుకే అన్ని విషయాల్లో వాళ్లను ఏమీ అనరు. వాళ్ల గురించి మాట్లాడరు. ఈ అవినీతి అనకొండలతో రేవంత్‌కు ఉన్న రహస్య ఒప్పందం బహిర్గతం కావాలి. పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో ఏముందో చెప్పకుండానే టక్కున సీబీఐకి ఇస్తామనడం ముందస్తు కుట్ర. కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీయడమే వారి లక్ష్యం. మీరు బట్టకాల్చి మీదవేసినట్లు ఆరోపణలు చేయడం కాదు. నేను డిమాండ్ చేస్తున్నా.. పేర్లు కూడా చెప్పాను. దమ్ము ధైర్యం ఉంటే వారిపై విచారణ చేయించాలి. వాస్తవాలు బయటపెట్టి వారితో అండర్‌స్టాండింగ్ లేదని నిరూపించుకోవాలి" అని కవిత సవాల్ చేశారు.

ఎవరో చెబితే ఆడే తోలుబొమ్మను కాదు..!

తాను తన తండ్రికి రాసిన లేఖను లీక్ చేసిన సందర్భంలో అసలు విషయాలు బహిర్గతం చేసినందుకు 90 రోజులుగా తనను దుష్ప్రచారాలతో వేధిస్తున్నారని కవిత తెలిపారు. ఇప్పుడు కాళేశ్వరం విషయంలో వాస్తవాలు మాట్లాడినందుకూ వాళ్ల సోషల్ మీడియా బ్యాచ్‌లు రేపటి నుంచి అడ్డగోలు విమర్శలు చేస్తాయన్నారు. "నన్ను బీజేపీ ఆపరేట్ చేస్తుందంటారు. కాంగ్రెస్ ఆపరేట్ చేస్తుందంటారు. ఒకరు రేవంత్‌రెడ్డి చెబితే మాట్లాడుతుందని, మరొకరు బండి సంజయ్ చెబితే మాట్లాడుతుందంటూ దుష్ప్రచారం చేస్తారు. ఖబడ్దార్ బిడ్డా.. నేను ఎవరో చెబితే ఆడే తోలుబొమ్మను కాదు. నాది కేసీఆర్ రక్తం.. తెలంగాణ బ్లడ్. వ్యక్తిగతంగా నేను అనుకున్న విషయాన్ని చెబుతున్నా. దానికి రాజకీయంగా ఇబ్బంది అయినా, నష్టమయినా, కష్టమయినా.. నేనే భరిస్తా" కవిత స్పష్టం చేశారు.

ఇలాంటి పార్టీ ఉంటే ఏంది? పోతే ఏంది?

దేశంలో ఎక్కడికి వెళ్లినా.. కేసీఆర్ మహానాయకుడు అంటారని కవిత తెలిపారు. ఇప్పుడు సీబీఐ విచారణ జరిపితే.. ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. "మా నాన్న పరువు పోతే నాకు బాధ. మీకా? వాళ్లకు పైసలు కావాలె. పేరుతో ఏం పని? ఇంక కూడా ఇటువంటి విషయాలు అర్థం చేసుకోకుండా, ఇలాంటి వ్యక్తులను దూరం పెట్టకుంటే.. ఇలాంటి పార్టీ ఉంటే ఏంది? పోతే ఏంది? బీఆర్ఎస్ నాయకులు నన్ను తిట్టుకున్నా సరే. స్థానిక ఎన్నికల్లో నష్టం జరుగుతదని అనుకున్నా సరే. మా నాన్నమీద సీబీఐ విచారణ పడ్డాక ఏముంది? ఎలక్షన్‌లో ఒకరు గెలుస్తరు, ఒకరు ఓడిపోతరు. అసలు పార్టీ ఓడిపోయే పరిస్థితి ఎందుకు వచ్చింది? ఇటువంటి దుర్మార్గుల వల్ల కాదా? ఊ అంటే.. మా దగ్గర పైసలున్నయని, టీవీలున్నయని, సోషల్ మీడియాలుయని ఎటు పడితే అటు మాట్లాడతామంటే తోలు తీస్తం. గీత గీసుకుంటం బిడ్డా. మీరు ఒక కామెంట్ పెడితే.. మేం పది పెడతాం. ఇంతకాలం చూస్తూ ఊరుకున్నా. పెద్ద సారు దగ్గరికి వచ్చాక ఇక కాంప్రమైజ్ అయ్యేది లేదు. నిజంగానే ఆయన అవినీతికి పాల్పడితే వేరుమాట. కేసీఆర్‌కు ఎప్పుడూ తెలంగాణ ధ్యాసే.. అదే పిచ్చి. అలాంటి వ్యక్తిపై ఏది పడితే అది మాట్లాడితే.. రియాక్ట్ కాకపోవడం చాలా దారుణం. సీబీఐ విచారణ చేస్తున్నామని రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటిస్తే.. తెలంగాణ బంద్‌కు పిలుపు ఇవ్వొద్దా? తెలంగాణ భగ్గుమనొద్దా? దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. ఏదేమైనా సీబీఐ విచారణ చేసినా.. కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారు" కవిత పేర్కొన్నారు.

మూడు పిల్లర్లు కుంగిపోతే రెండున్నరేళ్లుగా లొల్లి!

కేసీఆర్ తరతరాలకు తరగని ఆస్తిలా కట్టిన కాళేశ్వరాన్ని బద్నామ్ చేస్తున్నారని కవిత అన్నారు. "మహాసముద్రం లాంటి కాళేశ్వరంలో చిన్న పార్ట్ అయిన మేడిగడ్డలో మూడు పిల్లర్లు కుంగిపోతే.. ప్రాజెక్టు మొత్తం కూలిపోయిందని రెండున్నరేళ్లుగా లొల్లి పెడుతున్నారు. నేను 2006 నుంచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటూ రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్నాను. అప్పటినుంచి ఇప్పటివరకు ప్రజల విషయం తప్ప.. వ్యక్తిగత విషయాలు మాట్లాడరు. అటువంటి మహానాయకుడు అవినీతికి పాల్పడ్డారని, లక్ష కోట్లు దోచుకున్నారని, నిజాం కన్నా ధనికుడు కావాలనుకున్నారని అంటున్నారు. అవును కచ్చితంగా నిజాం బాటలోనే నడుస్తాం. నిజాం కట్టిన ఉస్మాన్‌సాగర్ నీళ్లే కదా.. నేటికీ హైదరాబాద్ ప్రజలు తాగుతున్నది! ఆ నిజాం స్ఫూర్తి అని మా నాన్న చాలాసార్లు చెప్పారు. కచ్చితంగా 200 ఏళ్లు తెలంగాణ ప్రజలు కాళేశ్వరం ప్రాజెక్టును కట్టిన కేసీఆర్‌ను తలుచుకుంటారు. కేసీఆర్‌కు ఉన్న అవగాహన, ఉమ్మడి ఏపీలో ఆయన అనుభవించిన వివక్ష, తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేసిన ప్రస్తుత సీఎంకు తెలియదు. నేటికీ ఆయన పక్క రాష్ట్రం ఎజెండాను అమలు చేస్తున్న వ్యక్తి.. బనకచర్ల కడతామంటే మాట్లాడని వ్యక్తి.. కేసీఆర్ గురించి అసెంబ్లీలో ఉదయం నుంచి రాత్రి వరకు అనరాని మాటలు అంటుంటే నా గుండె బరువెక్కింది. ఇదే రేవంత్‌రెడ్డి గతంలో ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'కేసీఆర్‌కు పైసల మీద ఆశలేదు. పాపం ఆయన మీటింగ్ పెట్టాలంటే కూడా.. అప్పుడు పైసల గురించి చూస్తారు' అన్నారు. అటువంటి ఆలోచన ఉన్న వ్యక్తిమీద ఇంత కుట్రపూరితంగా అభాండాలు ఎందుకు వేస్తున్నారు? ప్రజలు తిరగబడతారనుకుంటే.. ప్రభుత్వం తప్పులు బయటపడతాయంటే.. కేసీఆర్‌పై ఆరోపణ చేయాలి. ఆయన పేరు చెప్పకుంటే రేవంత్‌రెడ్డి ఫొటో కూడా పేపర్లో వేయరని ఆయన్ను విమర్శిస్తున్నారు. సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు పెడతామని, 50శాతం రిజర్వేషన్లు ఎత్తేస్తామని అంటున్నారు. రాహుల్‌గాంధీ బిహార్ ఎన్నికల ప్రచారం కోసం బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ రోజుకో కొత్తకథ చెబుతోంది. గవర్నర్ వద్ద పెండింగ్ పెడితే.. సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లడంలేదు? బిహార్ ఎన్నికల కోసమే బీసీ బిడ్డలను రేవంత్‌రెడ్డి బలి పెడుతున్నారు. ఇలాగే చేస్తే.. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బిహార్‌కు వెళ్లి ప్రచారం చేస్తాం" అని కవిత హెచ్చరించారు.

కవిత

సస్పెన్షన్ ఖాయం!?

నేడో, రేపో బీఆర్ఎస్ నుంచి ప్రకటన!.. కీలక నేతలతో అధినేత కేసీఆర్ భేటీ

- ఉపేక్షిస్తే పార్టీకి మరింత నష్టం అనే అభిప్రాయం
- ఎక్స్‌లో కవితను అన్‌ఫాలో చేయాలని ఆదేశం
- టీఆర్ఎస్ఎల్పీ వాట్సప్ గ్రూప్ నుంచి కవిత పీఆర్వో అవుట్
- సస్పెండైతే తెలంగాణ జాగృతి పేరుతో కవిత సొంత పార్టీ?



హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సొంత పార్టీకి చెందిన నేతలు హరీశ్‌రావు, జోగినపల్లి సంతోష్ కుమార్‌పై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. కవిత తీరుతో పార్టీకి మరింత నష్టం జరిగేలోపే ఆమెను బీఆర్ఎస్ నుంచి సాగనంపాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో పార్టీ నుంచి కవిత సస్పెన్షన్ ఖాయం అనే ప్రచారం బీఆర్ఎస్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. దీనిపై ఒక ట్రెండు రోజుల్లో బీఆర్ఎస్ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మీడియా సమావేశంలో హరీశ్, సంతోష్‌పై కవిత సంచలన వ్యాఖ్యలు చేశాక.. ఆ పార్టీ సీనియర్ నేతలు ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. అక్కడ కేటీఆర్, వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు మరికొందరు కీలకనేతలు కేసీఆర్‌తో భేటీ అయ్యారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై కేసీఆర్‌తో మంతనాలు జరిపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కవిత పార్టీలో ఉంటే లాభం ఉందా? అంటూ పార్టీ నేతలను కేసీఆర్ ప్రశ్నించారు. ఇంత పెద్ద వ్యాఖ్యలు చేశాక కూడా కవితను కొనసాగిస్తే పార్టీకి మరింత నష్టం అని, ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మెజారిటీ నేతలు కేసీఆర్‌కు సూచించారు. కవితను పార్టీలో కొనసాగితే విపక్షాలకు ఆయుధం ఇచ్చినట్లేనని నేతలు అభిప్రాయపడ్డారు. కవితపై ఎటువంటి చర్యలు తీసుకోకపోతే ముందుముందు మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందని అధినేతకు చెప్పారు. కవిత ఇదివరకే.. కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయంటూ వ్యాఖ్యానించారు. అప్పుడే ఆమెపై నిర్ణయం తీసుకుంటారని అంతా భావించారు. అయితే ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోకుంటేనే తక్కువ నష్టం జరుగుతుందనే భావన అప్పట్లో పార్టీ పెద్దల్లో ఉండిందని.. ఇప్పుడు చేయిదాటిపోయే స్థాయికి పరిస్థితి చేరిందని ఓ కీలక నేత చెప్పారు.

కవితపై బీఆర్ఎస్ నేతల మాటల దాడి

సామాజిక మాధ్యమాల్లో కవితను వెంటనే అన్‌ఫాలో కావాలని బీఆర్ఎస్ ఐటీ విభాగం నుంచి పార్టీ శ్రేణులకు ఆదేశాలు వెళ్లినట్లు గులాబీ వర్గాలు చెబుతున్నాయి. ఆ వెంటనే ఎక్స్ ఖాతాలో కవితను ఫాలో అవుతున్న కార్యకర్తలు వెంటవెంటనే అన్‌ఫాలో అయ్యారు. సామాజిక మాధ్యమాల్లో ఆమెకు వ్యతిరేకంగా కామెంట్లు పెట్టడం మొదలుపెట్టారు. ఎలక్ట్రానిక్ మీడియాలో బీఆర్ఎస్ తరపున చర్చలకు వెళ్లిన నేతలు కూడా కవిత తీరును తీవ్రంగా తప్పుబట్టారు. కొందరైతే కవిత తీరు వల్లే గత ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం పాలైందని ఆరోపించారు. మరికొందరు తక్షణమే ఆమె పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ఎల్పీ వాట్సప్ గ్రూప్ నుంచి కవిత పీఆర్వోను తొలగించారు. హరీశ్‌రావు ఆరడుగుల బుల్లెట్ అంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం పోస్టులు పెట్టింది. లండన్ పర్యటనలో ఉన్న హరీశ్‌రావుకు అక్కడి బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం ఘనస్వాగతం పలికింది.

సస్పెండ్ చేస్తే సొంతపార్టీ?

బీఆర్ఎస్ నుంచి కవితను సస్పెండ్ చేస్తే .ఆమె అడుగులు ఎటువైపు? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. అయితే మొదట్నుంచి ఆమె ఒక స్పష్టతతో ఉన్నారని, పార్టీ నుంచి బయటకు వెళ్లాల్సివస్తే, సొంత వేదిక ఏర్పాటు చేసుకోవాలని ముందే నిర్ణయం తీసుకున్నారని విశ్లేషకులు అంటున్నారు. 2023 ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలైనప్పటి నుంచి ఆమె తన జాగృతి సంస్థను నెమ్మదిగా బలోపేతం చేస్తూ వస్తున్నారు. జాగృతి పేరుతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్టీ పెడితే తెలంగాణ జాగృతినే పార్టీ పేరుగా ఖరారు చేసే అవకాశం ఉందని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. కొత్త పేరు జోలికి వెళ్లకపోవచ్చని ఆ వర్గాలు అంటున్నాయి.

పియానోపై ఆధ్యాత్మిక మేళవింపు

- ఎలాంటి భక్తి గీతాలైనా పారవశ్యమే
- భక్తి పాటలతో ఆకట్టుకుంటున్న సుశీల



మహిళలతో కలిసి పియానో వాయిస్తున్న గోదాసేవా తరంగిణి అధ్యక్షురాలు గుండా సుశీల

పియానోపై తన ఆధ్యాత్మిక సంగీత స్వరార్చనతో భక్తులను మంత్రముగ్ధులను చేస్తున్నారు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన గోదాసేవా తరంగిణి కమిటీ అధ్యక్షురాలు గుండా సుశీల. ఏడు పదుల వయస్సులోనూ ధనుర్మాస వేడుకలు, పండుగలు, దేవాలయాల్లో నిర్వహించే ఉత్సవాల సందర్భంగా పియానోపై భక్తి పాటలతో ఆకట్టుకున్నారు.

- ఆంధ్రజ్యోతి - హుజూర్‌నగర్

పట్టణానికి చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులు దివంగత ముడుంబై వెంకటనర్సింహాచార్యుల వద్ద హార్మోనియం నేర్చుకున్నారు. అనంతరం పియానోలోనూ తర్ఫీదు పొందారు. 30 ఏళ్లుగా పట్టణంలోని రామాలయంలో నిర్వహించే అనేక పూజా కార్యక్రమాల్లో పాల్గొంటూ పియానో వాయిస్తున్నారు. పట్టణంలో శ్రీగోదాసేవా తరంగిణి కమిటీ అధ్యక్షురాలిగా, అన్నమయ్య భజనమండలి కమిటీ సభ్యురాలిగా ఉన్నారు. తిరుమల-తిరుపతి దేవస్థానం, కాశీ, షిర్డీ, పండరి, అహోబిలం వంటి దివ్య క్షేత్రాల్లోనూ ప్రదర్శనలు ఇచ్చారు. హైదరాబాద్‌కు చెందిన భక్తిభజన సంకీర్తన ప్రచార పరిషత్ ఆమెకు 2020లో జీవిత సాఫల్య పురస్కారం అందజేసింది. ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి జిల్లా మహిళ అధ్యక్షురాలిగా ఆమె సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జనగణమన జాతీయ గీతాన్ని పియానోపై వాయించడం విశేషం. ఒకవైపు భక్తిగీతాలను స్వర పరుస్తూ సంగీతాన్ని మేళవించి హరి నామ సంకీర్తనలను అలవోకగా పాడుతూ నిత్యం దైవచింతనలో గడుపుతున్నారు. పట్టణంలో కాకతీయుల కాలంలో నిర్మించిన రామాలయం ఆమె ఆధ్యాత్మిక సంగీత స్వరాలు అందించేందుకు వేదికగా మారింది. పట్టణంలోని శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంతో పాటు రామాలయంలో ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా పియానోపై తన సంగీత స్వరాలను సైతం స్వర పరుస్తున్నారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్న గుండా సుశీల, భర్త గుండా భద్రయ్య గతంలో వ్యాపారం చేశారు. 20ఏళ్ల క్రితం సర్పంచ్ పదవికి పోటీ చేశారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

గురువు చెప్పింది ఇతర మహిళలకు నేర్పుతున్నా



పియానో నేర్చుకుని ఎన్నో భక్తిగీతాలు, అన్నమయ్య కీర్తనలు, జాతీయ, రాష్ట్రీయ గీతాలను స్వరపరుస్తున్నా. గురువు చెప్పింది ఇతర మహిళలకు నేర్పుతున్నా. ఎలాంటి భక్తి గీతాలైనా పియానోపై వాయించి భక్తి పారవశ్యం పొందుతున్నాను. నేటి మహిళలు సంగీతంలో పట్టు సాధించాలన్నదే లక్ష్యం.

- గుండా సుశీల, పియానో నిపుణురాలు

తోటి మహిళలకు పియానో నేర్పిస్తూ..

పియానోపై పట్టు సాధించిన సుశీల తోటి మహిళలకు ఉచితంగా పియానో నేర్పిస్తున్నారు. ఆర్యవైశ్య సంఘానికి చెందిన మహిళలు ఎంతోమంది ఆమె వద్ద శిక్షణ పొందుతున్నారు. ఇప్పటికే పియానో ఎలా వాయించాలో, భక్తిపాటలకు సంబంధించి స్వరాలను సమకూర్చే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. భక్తిగీతాలు, అన్నమాచార్య కీర్తనలు, భజన పాటలు, జాతీయ గీతం వంటి అనేక పాటలను తన పియానోపై వాయిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు.

వెబ్‌సైట్‌లో అనుమతులు పొందాలి

కోదాడరూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తెలంగాణ వెబ్‌సైట్ ద్వారా అనుమతులు పొందాలని ఉమ్మడి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్ వాణిశ్రీ అన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం నల్లబండగూడెం వద్ద ఉన్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారులు అనుమతుల కోసం ఇక నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. టెంపరరీ, పర్మినెంట్, స్పెషల్ పర్మినెంట్, వలంటరీ ట్యాక్స్ ఈ మూడు ఆన్లైన్లో నమోదు చేసుకోవడంతో చెక్‌పోస్టుకు వచ్చే అవకాశం లేకుండా ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న మూడు చెక్‌పోస్టులు త్వరలో ఎత్తివేస్తున్నట్లు తెలిపారు.

కళలకు జీవం పోస్తూ..

- యువతను భాగస్వాములు చేస్తున్న కళాకారుడు రంగాచారి
- అనేక గ్రామాలు తిరుగుతూ కళలపై శిక్షణ

కళలు కనుమరుగు కాకుండా భావితరాలకు అందించాలని తపిస్తున్నారు నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని గొడకొండ్ల గ్రామపంచాయతీలోని వెంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన బాణాల రంగాచారి. గ్రామాలు తిరుగుతూ అనేక మంది బాలలు, యువతకు శిక్షణ ఇస్తున్నారు. వారిని తన నాటక ప్రదర్శనలో భాగస్వాములు చేస్తున్నారు. కళలకు జీవం పోస్తూ ముందుకు సాగుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, చింతపల్లి



సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శనలో కళాకారులు

గొడకొండ్ల గ్రామపంచాయతీలోని వేంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన స్వర్ణకార సంఘం గౌరవ అధ్యక్షుడు బాణాల రంగాచారి తన వృత్తితో పాటు 20 సంవత్సరాలుగా కళారంగంపై ఉన్న మక్కువతో పలు గ్రామాల్లో నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో కలిసి హరికథలతో పాటు బ్రహ్మంగారి జీవిత చరిత్ర, గౌడ పురాణంలో నాటకాలు వేశారు. నటన, సంగీతం, సాహిత్యంపై పట్టు సాధించారు. చింతపల్లి మండలంలోని గొడకొండ్ల గ్రామానికి చెందిన వేణుగోపాలస్వామి భజన భక్త బృంద సభ్యులతో కలిసి పద్యనాటకాల్లో రంగాచారి వివిధ పాత్రలు పోషిస్తున్నారు. హార్మోనియం, తబలా, వాయించడంలో ప్రావీణ్యం సాధించారు.

పలు గ్రామాల్లో ప్రదర్శన

రంగాచారి ఇప్పటికే 80మంది బాలలు, యువతీ, యువకులకు పౌరాణికం, భాగవతం, హరికథలు, బుర్రకథలతో పాటు పోతులూరి వీరబ్రహ్మంగారి జీవిత చరిత్ర, సాంఘీక పద్య నాటకాల్లో శిక్షణ ఇచ్చారు. ఇప్పటికీ ఆయన వద్ద చాలా మంది శిక్షణ పొందుతున్నారు. శ్రీకృష్ణరాయబారంలో కృష్ణుడు, అర్జునుడిగా, సత్యహరిశ్చంద్ర నాటకంలో సత్యహరిశ్చంద్రుడిగా, దమయంతి నాటకంలో స్వయంవరంలో చక్రవర్తిగా, చింతమణి నాటకంలో బిల్వమంగళుడు, రామాంజనేయ యుద్ధంలో శ్రీరాముడి పాత్ర పోషించారు.

కళాకారులకు శిక్షణ

గొడకొండ్ల, గొల్లపల్లి, కుర్మేడ్, కుర్మపల్లి, పోలేపల్లిరాంనగర్‌లో ఎంతోమందికి శిక్షణ ఇచ్చి కళాకారులుగా తీర్చిదిద్దారు. దాతల సహకారంతో గొడకొండ్ల గ్రామంలో పోతులూరి బ్రహ్మంగారి జీవిత చరిత్రతో పాటు చింతమణి నాటకం, గొల్లపల్లి, కుర్మేడులో సత్యహరిశ్చంద్ర నాటకాలు ప్ర దర్శించారు. వీటితో పాటు ఏకపాత్రాభినయాలు ప్రదర్శించారు. హైదరాబాద్‌లోని త్యాగరాజగానసభ కళామందిరం సంస్థ ప్రతినిధులు రంగాచారి కళా నైపుణ్యాన్ని గుర్తించి సన్మానించారు. చింతపల్లి మండలకేంద్రంతో పాటు పోలేపల్లిరాంనగర్, మల్లేపల్లి, వింజమూర్, గొడకొండ్ల, వెంకటేశ్వరనగర్(మాల్)లో 30 మందికి పైగా కళాకారులు ఉన్నారు. వారికి గుర్తింపు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

కళాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



చిన్నారులను కళాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం. ఇందుకోసం పాఠశాలలకు వెళ్లి విద్యార్థులను కలుస్తుంటా. వారికి నాటకాలపై ఆసక్తి పెరిగేందుకు కృషిచేసేందుకు ప్రయత్నిస్తా. శిక్షణ ఇచ్చి వారిని నాటక ప్రదర్శనలో అవకాశం కల్పిస్తా. పౌరాణిక నాటకాలు అంతరించిపోకుండా ఉండేందుకు కృషి చేస్తున్న.

- రంగాచారి, కళాకారుడు, వీటీనగర్.

కళాకారులను గుర్తించాలి



ప్రభుత్వం కళాకారులను గుర్తించి ప్రోత్సహించేలా కృషిచేయాలి. ఆరోగ్యకార్డులు అందించాలి అర్హులైన పేద కళాకారులను గుర్తించి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి.

- మల్లోజు ఆచారి, గొడకొండ్ల

సంక్షేమ పథకాలు అందించాలి



కళాకారులకు ఎలాంటి గుర్తింపు లేకుండా పోయింది. చలనచిత్ర పరిశ్రమ ఏర్పాటుతో కళాకారులు జీవనం ఇబ్బందికరంగా మారింది. గ్రామాల్లో ప్రదర్శిస్తున్న నాటక రంగానికి ప్రస్తుతం గుర్తింపు ఉండడం లేదు. ప్రభుత్వం కళాకారులను గుర్తించి సంక్షేమ పథకాలు అందించాలి.

- పోలేపల్లి లక్ష్మయ్య, గొడకొండ్ల.

గుట్ట దేవస్థానంలో పటిష్ఠ భద్రత

- నిరంతర నిఘా కోసం సీసీ కెమెరాల బిగింపు
- సమీక్షలో ఈవో వెంకట్రావు



సమీక్షలో మాట్లాడుతున్న ఈవో ఎస్.వెంకట్రావు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయనున్నట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. యాదగిరికొండపై ఆలయ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏసీపీ పి.శ్రీనివాస్‌నాయుడు, పట్టణ ఇన్‌స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్, ఆలయ అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. దేవస్థానం పరిసరాల్లో నిరంతర నిఘాతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని వైపులా సీసీ కెమెరాలు అదనంగా బిగించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు మరింత సమాచారం ఎక్కువ రోజులు ఉండేలా నిర్ణయించామన్నారు. కొండపైకి వెళ్లేందుకు అన్ని మార్గాల్లో బారికేడ్లు, కొండకింద కల్యాణ కట్ట, వ్ర త మండపాలు, శివాలయం, క్యూలైన్లలగేజ్ స్కానర్లు వినియోగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రద్దీ రోజుల్లో కొండపైన స్థలాభావంతో ట్రాఫిక్ సమస్యల నివారణకు వాహనాల పార్కింగ్ కొండకింద చేసేలా చూడాలన్నారు. ప్రముఖుల వాహనాలు కూడా కొండపైకి నివారించేందుకు ప్రత్యేక ఏసీ బస్సు ద్వారా తరలించేందుకు సిద్ధం చేయాలన్నారు. సమీక్షలో ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మ, సివిల్ ఈఈ దయాకర్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఈఈ ఊడెపు వెంకటరామరావు, ఎస్పీఎఫ్ సీఐ కే.శేషగిరిరావు పాల్గొన్నారు.

కల్యాణోత్సవ నిర్వహణపై కెనడా ప్రధాని ప్రశంస

యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించటంపై కెనడా దేశ ప్రధాని మార్క్‌కార్నీ ప్రశంసించారు. ఈ ఉత్సవాల్లో పాల్గొన్న కెనడా దేశ ప్రధాని మార్క్‌కార్నీ ఆలయ ఏఈవో గజ్వేల్లి రఘుకు ఆదివారం ఉత్తరం ద్వారా ప్రశంసించారు. కెనడాలోని ఒట్టావా నగరం ఈవై సెంటర్‌లో శనివారం లక్ష్మీనరసింహుల కల్యాణోత్సవాన్ని వీక్షించామని, వైభవంగా నిర్వహించారని కొనియాడారు. దైవ సంబంధిత కార్యక్రమాల నిర్వహణపై యాదగిరిగుట్ట అర్చక బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. కెనడా ప్రధాని పంపిన లేఖపై దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు హర్షం వ్యక్తంచేశారు.

అధ్వానంగా రహదారులు



మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. వానొస్తే పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. మరమ్మతులు నోచుకోలేక పలు గ్రామాలకు వెళ్లే అనుసంధాన మట్టి రోడ్లు గుంతలు పడి వర్షపు నీటితో నిండి అస్తవ్యస్తంగా తయారై బాటసారులు కూడా వెళ్లలేని పరిస్థితి.వర్షం పడితే చాలు పలు గ్రామాలకు వెళ్లడాన్ని రద్దు చేసుకుంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

- (ఆంధ్రజ్యోతి,మర్రిగూడ)

- వానొస్తే రాకపోకలు బంద్
- మరమ్మతులకు నోచుకోని రోడ్లు
- గుంతలతో అస్తవ్యస్తంగా మారిన మట్టి దారులు

మర్రిగూడ మండలంలోని అనుసంధాన రోడ్లైన తానేదార్‌పల్లి గ్రామం నుంచి దామర బీమనపల్లి, నామాపురం నుంచి అంతంపేటకు, సరంపేట నుంచి సరంపేట తండాకు, వట్టిపల్లి నుంచి బట్లపల్లి, నర్సింపురం గేట్ నుంచి అజిలాపురం, మర్రిగూడ నుంచి మర్రిగూడ జంట తండాకు, కొండూర్ నుంచి బోటిమీద తండా గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్లు మరమ్మతులకు నోచుకోలేక గుంతలు పడి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వర్షాకాలం ఈ రహదారుల పరిస్థితి అధ్వానంగా మారుతోంది. మరో గ్రామానికి వెళ్లే పరిస్థితి లేదు. మండలంలో కురుస్తున్న వర్షాల వల్ల గుంతలు పడి నీరు నిండి రోడ్లన్నీ అధ్వానంగా, బురదమయంగా మారి బాటసారులు, ద్విచక్ర వాహనదారులు ఆ రోడ్లల్లో వెళ్లాలంటే జంకుతున్నారు. ఏ క్షణాన ఏమి సంభవిస్తుందో తెలియక ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లే పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు. ప్రతీ గ్రామం నుంచి మరో గ్రామానికి 4 నుంచి 5 కిలోమీటర్లు దూరం ఉంటుంది. ఈ గ్రామాలకు వెళ్లాలంటే బస్సులు లేవు, ఆటోలు కూడా నడవవు. కేవలం కాలినడకతో లేదా ద్విచక్ర వాహనాలపై వెళ్లాల్సిందే. రోడ్ల మర్మతులు నోచుకోక పోవడంతో ఈ రోడ్లు బాగాలేక చినుకు పడితే చాలు రోడ్లన్నీ చిత్తడిగా మారి గుంతలలో నీరు ఉండి నరకయాతన పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా మా బతుకులు మాత్రం మారటంలేదని పలువురు పేర్కొంటున్నారు. రహదారులకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు పలుమార్లు వేడుకున్నా పట్టించుకోనే వారే లేరని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అస్తవ్యస్తంగా ఉన్న గ్రామాల అనుసంధాన మట్టి రోడ్లకు మర్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



మండలంలో పలు గ్రామాలకు వెళ్లే అనుసంధాన మట్టి రోడ్లన్నీ మరమ్మతులు నోచుకోలేక గుంతలుగా మారాయి. వర్షాలు పడితే అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచి బురదమయంగా మారుతున్నాయి. ప్రజలు ఈ రోడ్ల నుంచి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి అనుసంధాన రోడ్లకు నిధులు మంజూరు చేయించి బీటీ రోడ్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి.

- ఎండి.యాసిన్ అలీ, తానేదారుపల్లి, మర్రిగూడ



'కల్యాణలక్ష్మి' ఆడబిడ్డలకు వరం

● డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు వరమని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం కల్యాణలక్ష్మి చెక్కులను పలువురు లబ్ధిదారులకు ఆయన అందజేసి మాట్లాడారు. మండలంలోని 18 గ్రామాలకు చెందిన 66 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నేలపట్ల నరేష్, చండూరు ఏఎంసీ చైర్మన్ దోటి నారాయణ, మాజీ ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, పార్టీ జిల్లా కార్యదర్శులు బూడిద లింగయ్యయాదవ్, వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, బ్లాక్, మండల, పట్టణ కమిటీల అధ్యక్షులు పాల్వాయి చెన్నారెడ్డి, భీమనపల్లి సైదులు, ఆరేళ్ల సైదులు, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఓట్లను తొలగించాలని వినతి

తిప్పర్తి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అక్రమ ఓట్లను తొలగించాలని జంగారెడ్డిగూడెం గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం వారు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లెపల్లివారిగూడెం శివారులో ఉన్న ఉన్న రెండు దాబా హోటళ్లలో పనిచేసే వర్కర్లు జంగారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓటును దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రాంతానికి సంబంధం లేని వారికి తాత్కాలిక పనులు చేసుకొని వెళ్లే వారికి ఓటు హక్కు ఎలా కల్పిస్తారని వారు ప్రశ్నించారు. అధికారులు వెంటనే ఓట్లను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు మల్లెపల్లి సతీష్, సాదుల సతీష్, వనపర్తి నాగరాజు, ఇట్టమల్ల బిక్షం, వెంకన్న, జానయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



రాహుల్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

కేతేపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మోదీ తల్లిని అవమానించేలా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్ అన్నారు. రాహుల్ వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం మం డలకేంద్రంలో దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. జాతీయపార్టీలో కీలక నా యకుడు మహిళలకు కనీస గౌరవం ఇవ్వాలని తెలియకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ.అనితాగౌడ్, టి.నర్సింహాచారి, జి.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్.విజయలక్ష్మి, వి.నాగయ్య, టి.అఖిల్, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా పుష్పలత

కట్టంగూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరు తహసీల్దార్‌గా ఏ.పుష్పలత సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నల్లగొండ కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ బదిలీపై కట్టంగూరుకు వచ్చి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి

చిట్యాల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలని మునిసిపల్ శానిటరీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్‌కుమార్ కోరారు. చిట్యాల జడ్పీ హైస్కూల్‌లోని విద్యార్థులకు సోమవారం వీధి కుక్కల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు కుక్క కరిస్తే రేబీస్ టీకాలను వేయించుకోవాలని, పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాక్సినేషన్ వేయించాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ నివారణపై అవగాహన ఉండాలి

మర్రిగూడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధి నివారణ మన ధ్యేయమని మండల టీబీ నోడల్ సూపర్‌వైజర్ ప్రేమ్ కుమార్ అన్నారు. సోమవారం జన్ భగీరథ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మోడల్ స్కూల్ పాఠశాల విద్యార్థుల విద్యార్థినిలకు టీబీ నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైదులు, ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ టీబీ వ్యాధి సోకకుండా తగు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని తీసుకోవాలని అన్నారు. టీబీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేష్ గౌడ్. అమృత, సబితా, భారతి, వెంకటేష్, శ్రీలక్ష్మి, అరుణ సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్, హరీ‌ష్‌రావును బదనాం చేసే కుట్ర

● బీఆర్ఎస్ నాయకులు బండా, కంచర్ల భూపాల్‌రెడ్డి



గడియారం సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నల్లగొండ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపన్ని మాజీ సీఎం కేసీఆర్‌ను, మాజీ మంత్రి హరీ‌ష్‌రావును బదనాం చేయాలని చూస్తున్నారని జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ సోమవారం పార్టీ జిల్లా కార్యాలయం నుంచి ద్విచకర వాహన ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కుటిల రాజకీయాలు ప్రదర్శిస్తోందని, ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా ప్రజల మద్దతుతో తిప్పికొడతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ప్రజల మద్దతు కోల్పోయిందని, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతోనే ప్రభుత్వం కాళేశ్వరం డ్రామా ఆడుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర పూరితంగానే సీబీఐ విచారణ కోసం తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చీర పంకజ్‌యాదవ్, మాలే శరణ్యారెడ్డి, రెగట్టే మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, సింగం రాంమోహన్, తుమ్మల లింగస్వామి, మారగోని గణేష్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, కొండూరు సత్యనారాయణ, దేప వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం పలువురు నాయకులను, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు.

● నార్కట్‌పల్లి: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర రాజకీయాలు చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును సీబీఐకి అప్పగించడాన్ని నిరసిస్తూ సోమవారం నార్కట్‌పల్లిలో నల్లకండువాలు ధరించి నిరసన తెలిపారు. బస్టాండ్ ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు చిరుమర్తి యాదయ్య, పుల్లెంల ముత్తయ్య, మల్గ బాలకృష్ణ, ప్రజ్ఞాపురం రామకృష్ణ, కొత్త నర్సింహ, మహేశ్వరం సతీష్, పాశం సత్తిరెడ్డి, వాడపల్లి నవీన్, వడ్డేపల్లి నాగరాజు, రామలింగం, జానీ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యపై పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న వరికుప్పల ముత్యాలు

మర్రిగూడ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిరంతరం పోరాడుతుందని భవన నిర్మాణ కార్మిక జిల్లా సహాయ కార్యదర్శి వరికుప్పల ముత్యాలు అన్నారు. మండలకేంద్రంలో సోమవారం భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. లేబర్ కార్డుల విషయంలో కొలిక్కి తీసుకొచ్చి, వారి సమస్యల పరిష్కారం కోసం కృషిచేసినట్లు తెలిపారు. అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏర్పుల లింగస్వామి, ప్రధాన కార్యదర్శి, సభ్యులుగా ఎరుపుల యాదయ్య, ఎండీ కాశీం, యాచారం రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, సలోజ్ రామలింగచారి, రమేష్, యాదయ్య, నరసింహ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించడంలో విఫలం

చిట్యాల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పాలక ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ఆరోపించారు. చిట్యాల తహసీల్దార్ కార్యాలయంవద్ద సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రజాప్రతినిధులు లేక స్పెషల్ ఆఫీసర్ల పాలనలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. వర్షాలకు గ్రామీణప్రాంత రోడ్లు దెబ్బతిన్నాయని వెంటనే నిధులు కేటాయించి రోడ్లకు మరమ్మతు చేయించాలని కోరారు. గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయని, ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. పిలాయిపల్లి, ధర్మారెడ్డి, ఉదయసముద్రం ప్రాజెక్టు పనులను పూర్తిచేసి రైతులకు సాగు నీరందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, మల్లం మహేష్, ఆరూరి శ్రీను, పట్టణ కార్యదర్శి బొబ్బల సుధాకర్‌రెడ్డి, పంది నరేష్, యాదయ్య, మెట్టు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: నల్లగొండ పట్టణంలో పేరుకుపోయిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హాశం డిమాండ్ చేశారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఎం ఆధ్వర్యంలో నెల రోజులుగా పట్టణంలో చేసిన సర్వేలో అడుగడుగునా సమస్యలే తప్ప అభివృద్ధి ఎక్కడ కనిపించడం లేదన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక కంపచెట్లు పెరిగి విద్యుత్ కోతలు వంటి సమస్యలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎండీ సలీం, కార్యదర్శి దండంపల్లి సత్తయ్యలతో కూడిన మునిసిల్ కమిషనర్‌కు వినతిపత్రం అదజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఊట్కూరి నారాయణరెడ్డి, తుమ్మల పద్మ, కుంభం కృష్ణారెడ్డి, రవీందర్, దండంపల్లి సరోజ, నరసింహ, పాక లింగయ్య, అద్దంకి నరసింహ, ఊట్కూరి మధుసూదన్, అశోక్ తదితరులు ఉన్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు.

కళాకారుల కుటుంబాలను ఆదుకోవాలి

మర్రిగూడ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కళాకారుల కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బూడిద సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని ఖుదాభక్షపల్లి గ్రామంలో సీపీఐ జిల్లా సీనియర్ నాయకుడు సత్యం ఆధ్వర్యంలో కళాకారులకు టీషర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్, సత్యం మాట్లాడుతూ కళ ప్రజల కోసమన్నారు. సమాజం ఉన్నంతవరకు, సమాజ మార్పు కోసం పాట ప్రాముఖ్యత పాత్ర పోషిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఇసుకేల్ల మహేందర్, లక్ష్మీపతి, లక్ష్మయ్య, మేతరి యాదయ్య, మహేష్, నరసింహ పలువురు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

మూసీకి తగ్గిన వరద

కేతేపల్లి, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు వరద నీటి రాకడ నిలకడగా కొనసాగుతోంది. ఐదారు రోజులుగా ఎగువ నుంచి వచ్చే వరద నీటితో పొంగిపొర్లిన మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుతూ వస్తోంది. సోమవారం సాయంత్రానికి 4934.84 క్యూసెక్కులుగా నమోదైంది. మరోవైపు ప్రాజెక్టు 643.70 అడుగుల గరిష్ఠ స్థాయిలో ఉంచుతూ అధికారులు ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లోకు అనుగుణంగా పాజెక్టు 4 క్రస్టుగేట్ల ద్వారా 5706.84 క్యూసెక్కుల వరద నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు. 645 అడుగులు(4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ప్రాజెక్టు నీటిమట్టం సోమవారం సాయంత్రానికి 643.70అడుగులు (4.12టీఎంసీలు)గా ఉంది. ప్రాజెక్టు ఆయకట్టుకు కుడి, ఎడమ కాల్వల ద్వారా 457.42క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది.

సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

నల్లగొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తక్షణమే సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలుచేయాలని కోరారు. ఉద్యోగుల జీవిత భద్రత కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎస్‌కు సంబంధించి కట్ చేసి ఉద్యోగుల వాటా, ప్రభుత్వ వాటాను గత ప్రభుత్వం నుంచి జమ చేయకపోవడం దారుణమన్నారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులను క్లియర్ చేసి పీఆర్సీ మంజూరు చేయాలని, హెల్త్‌కార్డులను అమలు చేయాలన్నారు. జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, 63 పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ ధర్నాలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షన్‌దారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల జేఏసీ చైర్మన్ నాగిళ్ల మురళి, నాయకులు శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, తరాల పరమేష్, హాలీం, వెంకులు, బిక్షమయ్య, జనార్దన్, సందీప్‌రెడ్డి, చరితా రెడ్డి, కృష్ణమూర్తి, శ్రీశైలం పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి: సీఐ



సీఐ ఆదిరెడ్డి

చండూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన వేడుకల్లో శాంతి భద్రతలకు ఆటంకం కలగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ ఆదిరెడ్డి అన్నారు. చండూరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 5వ తేదీన వినాయక నిమజ్జనం ప్రారంభమవుతున్న నేపథ్యంలో రెవెన్యూ, ఆ రోగ్య, విద్యుత్, ఆర్అండ్‌బీ శాఖలతో పోలీసుశాఖ సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉత్సవ కమిటీల వారు పోలీసుల సూచనలు పాటించాలని తెలిపారు. చండూరు సర్కిల్ పరిధిలో గట్టుప్పల 54, చండూరు 209, మునుగోడు మం డలాల్లో 218 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. గట్టుప్పల, చండూరు మండలాలు కనగల్ మండలం కురంపల్లి కెనాల్‌లో, మునుగోడు మండలాలకు చెందిన వారు పులిపలుపుల, కిష్టాపురం గ్రామాల్లో ఉన్న చెరువులో నిమజ్జనం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

యూరియా కోసం రైతుల తిప్పలు



కట్టంగూరులో యూరియా కోసం బారులుదీరిన రైతులు

శాలిగౌరారం/ తిప్పర్తి/ కట్టంగూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. శాలిగౌరారంలోని ఒక ఎరువు మందుల దుకాణానికి 200 బస్తాల యూరియా వచ్చిందన్న విషయం తెలుసుకున్న రైతులు సోమవారం తెల్లవారుజామున వచ్చి బారులు తీశారు. వర్షం కురుస్తున్నప్పటికి లెక్క చేయకుండా యూరియా కోసం నిరీక్షించారు. పోలీసులు పెద్ద ఎత్తున చేరుకొని పహారా చేశారు. శాలిగౌరారం మండల వ్యవసాయాధికారి సౌమ్య శృతి తమ సిబ్బందితో ఒక రైతుకు ఒక్క బస్తా చొప్పున టోకెన్ ఇచ్చారు. బస్తాల కంటే ఎక్కువగా రైతులు రావడంతో బస్తాలు దొరక్క నిరాశ చెందారు.

● తిప్పర్తిలో సోమవారం యూరియా వస్తుందనే సమాచారంతో మండల కేంద్రంలోని రైతు ఆగ్రోస్ కేంద్రం ఎదుట పెద్ద ఎత్తున లైనులో నిల్చున్నారు. ఈసందర్భంగా ఏవో సన్నిరాజు మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో రైతులకు 300మెట్రిక్ టన్నుల యూరియా కావాల్సి ఉందని అన్నారు. ట్రాన్స్‌పోర్ట్ కారణాల వల్లన కొంత ఆలస్యం అవుతోందని తెలిపారు.

● కట్టంగూరులోని పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతులు తెల్లవారుజాము నుంచే పడిగాపులు కాశారు. మండలానికి సోమవారం 222 బస్తాలు రాగా ఒక్కొక్క రైతుకు ఒక్కొక్క బస్తా చొప్పున అధికారులు పంపిణీ చేశారు. కట్టంగూరు మండలానికి 24మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటి వరకు 1900మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు ఏవో గిరి ప్రసాద్ తెలిపారు.

యూరియా నిల్వలు నిల్

(5వపేజీ తరువాయి)

మమ్మురమయ్యాయి. ఆయకట్టు కింద అత్యధికంగా వరి నాట్లు వేస్తుండటంతో రైతులకు ఎరువుల అవసరం పెరిగి, కొరత నేపథ్యంలో రోడ్డెక్కుతున్నారు.

ఎప్పటికప్పుడూ ప్రణాళికలతో ముందుకు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ఎప్పటికప్పుడూ ప్రణాళిక ప్రకారం ఎరువుల సరఫరాపై ముందుకు సాగుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కొద్ది రోజుల క్రితం 50వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తామని రాష్ట్రానికి హామీ ఇచ్చింది. అందులో జిల్లాకు 4వేల మెట్రిక్ టన్నులను కోటాగా కేటాయించారు. ప్రస్తుతం గోదాముల‌ల్లో ఎరువుల నిల్వలు లేకపోవడంతో వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడూ రోజువారీగా లేదా, మూడు రోజులకొకసారి యూరియాను తెప్పిస్తూ రైతులకు సరఫరా చేస్తున్నారు.

ఒక్కో రైతుకు బస్తా లేదా రెండు బస్తాలకు మించి యూరియా అందని పరిస్థితి నెలకొంది. దీంతో పీఏసీఎస్ కేంద్రాల వద్ద రైతులు గంటల కొద్దీ పడిగాపులు పడుతున్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొన్ని చోట్ల పోలీసుల సహకారంతో యూరియా సరఫరా చేస్తున్నారు. యూరియా కొరత తీవ్రం కావడంతో అధికారులు నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో గణేశుడి వద్ద అన్నదానాలు



నల్లగొండలోని సావర్కర్‌నగర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ కౌన్సిలర్లు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మండపాల వద్ద ప్రత్యేకంగా అలంకరించిన లైట్ల మధ్య పూజాధికాలను నిర్వహిస్తున్నారు. రాబోయే స్థానిక ఎన్నికల దృష్ట్యా ఆశావహులు అన్నదాన కార్యక్రమాలను పోటీపడి చేస్తున్నారు. కొందరు మూడు రోజులు మరికొందరు ఐదు రోజులు ఇలా పూజలు చేసిన అనంతరం గణనాథులకు పట్టణంలో శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనం చేస్తున్నారు. చెర్వుగట్టులో సోమవారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ సర్పంచ్ మేకల రాజిరెడ్డి, కమ్మంపాటి వెంకటయ్య, మేకల కరుణాకర్‌రెడ్డి, దొడ్డి నర్సింహ్మా, వంపు శివశంకర్, గాదరి రాంబాబు, కట్ట బిక్షం, వనం రామలింగయ్య, మోహన్, శోభన్, శంకర్‌లు పాల్గొన్నారు.

కట్టంగూరు : కట్టంగూరు, అయిటిపాముల, చెర్వుఅన్నారం, ఈదులూరు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల వద్ద సోమవారం భక్తులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మార్తవారిగూడెం జరిగిన అన్నదాన కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నలగాటి ప్రసన్నరాజు పాల్గొని ఉత్సవ కమిటీ రూ.10వేలు విరాళంగా ఇచ్చి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ నూక సైదులు, బీఆర్ఎస్ నాయకులు ఉట్కూరి ఏడుకొండల్, మేకల రమేష్, చొప్పరి నాగరాజు, కోటి నాగరాజు, ఎడ్ల యాదయ్య పాల్గొన్నారు.




చెర్వుగట్టులో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కనగల్: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వారం రోజుల నుంచి మండపాల్లో పూజలందుకున్న గణపతి విగ్రహాలు ఒక్కొక్కటిగా గంగమ్మ ఒడికి చేరుతున్నాయి. దర్వేశిపురం ఎల్లమ్మ ఆలయంలో ప్రతిష్ఠించిన విగ్రహానికి సోమవారం ఉదయం చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈఓ అంబటి నాగిరెడ్డి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం విగ్రహాన్ని ఆలయ సిబ్బంది, దర్మకర్తలు, భక్తులు ఊరేగింపుగా తరలించి ఎస్ఎల్‌బీసీ కాల్వ నీటిలో నిమజ్జనం చేశారు. కనగల్ స్ఫూర్తి స్కూల్‌లో నెలకొల్పిన విగ్రహాన్ని సమీప చెరువుకు తరలించి నిమజ్జనం చేశారు.

నల్లగొండ రూరల్ : పట్టణంలోని సావర్కర్ నగర్‌లోని వినాయకుడి విగ్రహం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బొడ్డుపల్లి లక్ష్మీశ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ యామ దయాకర్ కవితాదయాకర్ పాల్గొన్నారు. కమిటీ సభ్యులు టి.రవీందర్‌రెడ్డి, మంచిరాజుశ్రీకాంత్, కె.సైదులు, వనం రమేష్, అనంతరెడ్డి శ్రీనివాస్‌గౌడ్, శ్రవణ్, లక్ష్మణ్, శంకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.0
కనిష్ఠం 22.0
***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 2 సెప్టెంబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586 (300.3200)	3,27,953	3,27,953
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.70 (4.12)	4,934.84	5,705.84
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	169.814 (38.0890)	3,01,928	2,76,986

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.170 | స్కిన్‌లెస్ : రూ.200



నిడమనూరులో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

యూరియా నిల్వలు నిల్

» వచ్చిన ఎరువులు వచ్చినట్టే పంపిణీ » 1న 680 మెట్రిక్ టన్నుల సరఫరా
» నేడు మరో 1,000టన్నుల దిగుమతి » ఎరువుల కొరతతో రోడ్డెక్కుతున్న రైతులు

జిల్లాలో ఎన్నడూ లేని విధంగా వానాకాలం సీజన్‌లో యూరియా కొరత తీవ్రంగా ఉంది. జిల్లాలో ఈ సీజన్‌లో మొదటి సారిగా గోదాముల్లో యూరియా నిల్వలు లేకుండా పోయాయి. గతంలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉండేవి. కేంద్రం నుంచి యూరియా సరఫరా అరకొరగా ఉండటం వల్లే ఈ సమస్య ఏర్పడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా, యూరియా కొరతతో రైతులు నిత్యం ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు.
- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

జిల్లాకు దిగుమతి అయిన యూరియా వచ్చింది వచ్చినట్టే పంపిణీ అవుతోంది. యూరియా వచ్చిందని తెలియగానే రైతులు పీఏసీఎస్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. చెప్పులు, రాళ్లు,ఆధార్ జిరాక్స్‌లు, పాస్‌పుస్తకాల జిరాక్స్‌లను క్యూలైన్‌లోపెడుతూ బస్తాయూరియా కోసం గంటల తరబడి పడిగాపులు పడుతున్నారు. సోమవారం జిల్లాలో 680మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీచేశారు. మండలానికి 20 మెట్రిక్ టన్నులు మాత్రమే అధికారులు సరఫరా చేశారు. ఈ నెల 2న జిల్లాకు 1,000టన్నుల యూరియా రానుండగా, 5న మరో 1,000టన్నులు, 10వ తేదీ నాటికి మరో 4వేల మెట్రిక్ టన్నుల యూరియాను దిగుమతి చేసుకునేందుకు వ్యవసాయశాఖ ప్రయత్నాలు చేస్తోంది. కేంద్రం నుంచి యూరియా సకాలంలో వచ్చి ఉంటే జిల్లాలో ఈ పరిస్థితులు తలెత్తివి కావని పలువురు పేర్కొంటున్నారు. సోమవారం యూరియా కోసం నిడమనూరులో రైతులు రెండు గంటల పాటు రాస్తారోకో చేశారు. హాలియా, తిప్పర్తి, పీఏపల్లి, శాలిగౌరారం, కట్టంగూరు మండలాల్లో రైతులు యూరియా కోసం పడిగాపులు కాశారు. డిండి మండలంలో కూడా యూరియా కొరత తీవ్రంగా ఉంది.

పత్తికి తగ్గిన వాడకం, వరికి పెరిగిన అవసరం

జిల్లాలో పత్తిచేలు ప్రస్తుతం గూడ, కాత దశకు చేరుకున్నాయి. దీంతో పత్తికి యూరియా వాడకం తగ్గగా వరికి యూరియా అవసరం పెరిగింది. సాగర్ ఆయకట్టుతో పాటు బోరుబావుల కింద వరినాట్లు ముమ్మరం కావడంతో యూరియాను పెద్ద మొత్తంలో రైతులు వినియోగిస్తున్నారు. దీంతో వ్యవసాయ శాఖ ఎప్పటికప్పుడూ యూరియా ఇండెంట్ పెడుతూ దిగుమతి చేసుకుంటోంది. ఈ మాసానికి 18వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంది. డిమాండ్‌కు తగినంతగా యూరియా దిగుమతి రాకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా కొరతతో పంటల దిగుబడిపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం పంటల విస్తీర్ణం 11,60,389 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. గత వానాకాలంలో 11,50,556 ఎకరాల్లో పంటలు సాగుకాగా, ఈ ఏడాది అదనంగా 10వేల ఎకరాలకు పైగా పంటల విస్తీర్ణం పెరిగింది. ఈ ఏడాది వానాకాలంలో 5,47,735 ఎకరాల్లో పత్తి సాగు కాగా, వరి 5,25,350ఎకరాల్లో సాగైంది. కందులు 10వేల ఎకరాల్లో, ఇతర మెట్ట పంటలను సైతం రైతులు సాగు చేశారు. ప్రధానంగా ఇటీవల వర్షాలు కురియడంతో వరినాట్లు

- మిగతా 8వ పేజీలో...

నేడు మరో 1,000టన్నుల యూరియా సరఫరా చేస్తాం



జిల్లాలో రైతులకు ఇబ్బందులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడూ యూరియాను పంపిణీ చేస్తోంది. సోమవారం 680 మెట్రిక్ టన్నులను రైతులకు సరఫరా చేశాం. 2న జిల్లాకు మరో 1,000టన్నులు రానుంది. ప్రతీ మండలంలో రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియాను అందుబాటులో ఉంచుతున్నాం. సోమవారం ప్రతీ మండలంలో 20టన్నుల యూరియాను అందుబాటులో ఉంచాం. ఈ నెల 5న మరో 1,000టన్నులు రానుండగా, 10వ తేదీ వరకు 4వేల మెట్రిక్ టన్నుల యూరియాను దిగుమతి చేసుకుంటాం. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.
- పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ

సీపీఎస్ రద్దుచేయాలి



కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు సోమవారం పెన్షన్ విద్రోహ దినాన్ని నిర్వహించారు. 8

కుట్రను తిప్పి కొట్టాలి



కాళేశ్వరం ప్రాజెక్టుపై లేనిపోని ఆరోపణలు చేస్తూ కేసును సీబీఐకి అప్పగించడంపై బీఆర్‌ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. జిల్లా వ్యాప్తంగా నాయకులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. 8

'ప్రజావాణి' ఫిర్యాదులను పరిష్కరించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి


నల్లగొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. మొత్తం 99 ఫిర్యాదులు రాగా, అందులో రెవెన్యూశాఖకు చెందిన ఫిర్యాదులు 69 ఉన్నాయి. 'ప్రజావాణి' అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. వీధి కుక్కల సమస్య ఎక్కువగా ఉన్నందున వాటి నివారణకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవోలు వెంటనే పంచాయతీ కార్యదర్శులతో ఈ విషయంపై సమావేశం నిర్వహించాలన్నారు. ప్రత్యేక అధికారులు హాస్టళ్లు, పాఠశాలలు తనిఖీ చేయాలన్నారు. ప్రత్యేక అధికారులు మండలాలను సందర్శించినప్పుడు ఏదైనా చిన్న పనులకు నిధులు మంజూరు చేయాల్సి వస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ధర్తి అబా జనజాతీయ యోజన కింద చేపట్టిన యూనిట్ల గ్రౌండింగ్ తదితర అంశాలను కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామరావు, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

టీబీని గుర్తించే పరికరాల అందజేత: టీబీని గుర్తించే రూ.20లక్షల విలువైన పరికరాలను సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఎస్‌వో వెంకటేష్, పౌరసరఫరాల డీఎం హరీష్, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి నారాయణ, ప్రధాన కార్యదర్శి రేపాల భద్రాద్రి, మిర్యాలగూడ అసోసియేషన్ అధ్యక్షుడు గౌడ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలపై విస్తృత ప్రచారం కల్పించాలి: వీధి కుక్కలపై పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారం కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. పాఠశాల విద్యార్థులకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. వీధి కుక్కల స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్, దత్తత వంటి అంశాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, డీఈవో భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖను మరింత చేరువచేస్తాం

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 54మంది ఫిర్యాదులు తీసుకొని వారితో మాట్లాడారు. బాధితుల సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి వినతులు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

విధుల్లోకి వెళ్లే ముందు .. 6

మొబైల్ ఇవ్వాల్సిందే

మిర్యాలగూడ డిపోలో అమలులోకి వచ్చిన పైలట్ ప్రాజెక్ట్

నష్టం అంచనాలు రూపొందించాలి

వీడియోకాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పాల్గొన్న జిల్లా అధికారులు

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కలిగిన నష్టం అంచనాలు రూపొందించి అందజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారు. ప్రకృతి విపత్తుల ద్వారా జరిగిన నష్టాలపై వేగవంతంగా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖలకు చెందిన రోడ్లు తేగాయని, లోలెవల్ కాజ్‌వేలు, కల్వర్టులు, ఇరిగేషన్ మైనర్, మేజర్ ప్రాజెక్టుల చెరువు కట్టలు దెబ్బతిన్నాయన్నారు. వాటిని అధికారులు గుర్తించి మరమ్మతులు చేయాలన్నారు. వరద నష్టంపై పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, వ్యవసాయ, విద్యుత్, ఇరిగేషన్ శాఖలు వేగవంతంగా నివేదికలు సమర్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, పాల్గొన్నారు.

అధికారులు నివేదికలు రూపొందించాలి

వర్షంతో జిల్లాలో జరిగిన నష్టంపై అధికారులు నివేదికలు రూపొందించి అందజేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. జిల్లాలో ఇటీవల భారీ వర్షాలకు ఆర్‌అండ్‌బీ రహదారులు మాత్రమే దెబ్బతిన్నాయని, నష్టం అంచనా వివరాలను వెంటనే తయారుచేసి సమర్పించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్, మునిసిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి విమల

నల్లగొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలను త్వరగా పూర్తిచేయాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి విమల అన్నారు. సోమవారం డీసీఈబీ కార్యదర్శి కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘాల అధ్యక్షుల ఉమ్మడి సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు ముందుగా నియోజకవర్గస్థాయి పోటీలు పూర్తిచేయాల్సి ఉందన్నారు. డీఈవో ఆదేశాల మేరకు ఆరు నియోజక వర్గాలకు కన్వీనర్లను నియమించామన్నారు. నల్లగొండ కన్వీనర్‌గా వీసం రాజు, నకిరేకల్‌కు నంద్యాల నర్సింహారెడ్డి, తిరిమలగిరి (సాగర్)కు మైలారిశెట్టి సత్యనారాయణ, మిర్యాలగూడకు బోయపల్లి శోభారాణి, దేవరకొండకు ఇటుకపాటి జయమ్మ, మర్రిగూడకు పాల్తిచిన జంగయ్యను నియమించినట్టు తెలిపారు. వీరి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బీఫార్మసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయాలి

హెచ్‌ఆర్‌సీ చైర్మన్ షమీమ్ అక్తర్ ఆదేశాలు

నల్లగొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణ సమీపంలోని చర్లపల్లి నలంద కళాశాలలో బీఫార్మసీ పూర్తి చేసిన 16 మంది విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను, టీసీలను తక్షణమే ఇవ్వాలని మానవ హక్కుల సంఘం చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఆదేశాలు జారీ చేశారు. కొద్ది రోజుల క్రితం బీఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులు నలంద కళాశాల యాజమాన్యంపై హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందని సర్టిఫికెట్లు ఇవ్వకుండా నిరాకరించడం రాజ్యాంగబద్ధమైన మౌలిక హక్కుల ఉల్లంఘన అని ఉత్తర్వుల్లో ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్-21 కింద హక్కుల ఉల్లంఘనగా కమిషన్ గుర్తించిందని, విద్యను మౌలిక మానవ హక్కుగా పరిగణిస్తూ విద్యార్థులకు తక్షణమే సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆదేశించారు. అదేవిధంగా కళాశాల చైర్మన్, డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఈనెల 8వ తేదీన కమిషన్ ఎదుట హాజరుకావాలని ఆదేశించారు.

రైతులకు సరిపడా యూరియా

జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్



కట్టంగూరులో యూరియా స్టాక్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్

కట్టంగూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్‌కుమార్ తెలిపారు. సోమవారం కట్టంగూర్ పీఏసీఎస్ వద్ద యూరియా పంపిణీని పరిశీలించి స్టాక్ వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు అవసరం మేరకే యూరియా కొనుగోలు చేసి వినియోగించాలని సూచించారు. జిల్లాకు 70వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ఇప్పటి వరకు 51వేల మెట్రిక్ టన్నుల వచ్చిందని, ఆ మొత్తాన్ని రైతులకు పంపిణీ చేశామన్నారు. జిల్లాకు 19వేల మెట్రిక్ టన్నుల యూరియా ఇంకా రావలసి ఉందన్నారు. ఈ నెల 2న మరో 1,300 టన్నుల యూరియా జిల్లాకు వస్తుందని తెలిపారు. పంపిణీ కేంద్రాల వద్ద రైతులు అధికారులకు సహకరించాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి గిరిప్రసాద్, పీఏసీఎస్ సీఈవో బండ మల్లారెడ్డి, ఏఈవో నవీన్, తదితరులు ఉన్నారు.

సృజనాత్మకత పెంపుదలకు

సదస్సులు దోహదం

ఎంజీయూ వీసీ అల్తాఫ్‌హుస్సేన్

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపుదలకు సదస్సులు దోహదపడుతాయని ఎంజీయూ ఉపకులపతి ఆచార్య అల్తాఫ్‌హుస్సేన్ అన్నారు. 'డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య సాహిత్యం -సమాలోచన' అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఎంజీయూలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సాహిత్య అకాడమి సౌజన్యంతో రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్యార్థుల్లో సాహిత్యంపై ఆసక్తిని, స్ఫూర్తిని ఇస్తామన్నారు. సదస్సు రాహత్‌ఖానమ్, డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, వైస్‌ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, జె.చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంజీయూ వీసీ అల్తాఫ్‌హుస్సేన్

నేటి నుంచి సత్యనారాయణస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు

నాగార్జునసాగర్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): సాగర్ హిల్‌కాలనీలో శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం నుంచి శుక్రవారం వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు రాధకృష్ణమాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిరోజు విశ్వక్సేనపూజ, అఖండ స్థాపన, రెండోరోజు బుధవారం హోమ నిర్వహణ, 360రకాల నైవేద్యాల సమర్పణ, గురువారం పవిత్రాధివాసం, శుక్రవారం పూర్ణాహుతి, లక్ష్మీకల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఓటు చోరీపై ఆధారాలు ప్రజలకు తెలియజేయాలి

దేవరకొండ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఓటు చోరీపై ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆధారాలు ప్రజలకు తెలియజేయాలని ఎన్ఎస్‌యూఐ జాతీయ సోషల్‌మీడియా కోఆర్డినేటర్ పానగంటి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. దేవరకొండలోని భవిత డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులతో కలిసి పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. బీజేపీ ప్రజల ఓటు హక్కులను కాలరాసి రాజ్యాంగాన్ని తాకట్టు పెట్టేలా ఓటు దోపిడీకి పాల్పడుతుందని ఆరోపించారు.

శోభాయాత్రకు ఏర్పాట్లు చేయాలి

● ఏఎస్పీ మౌనికకు వినతి

దేవరకొండ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్న వినాయక నిమజ్జన శోభయాత్రకు అన్ని ఏర్పాట్లు చేయాలని హిందూ ఉత్సవ సమితి నేతలు కోరారు. సోమవారం దేవరకొండ ఏఎస్పీ మౌనిక, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో అన్ని మండపాల విగ్రహాలు ఒకే రూటులో శోభాయాత్రలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకుగాను ఏర్పాట్లు చేసి నిర్వాహకులకు సహకరించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ఉత్సవసమితి అధ్యక్ష, కార్యదర్శులు బెలిజ శ్రీనివాస్, కర్నాటి సురేష్, శంకర్, తాటిశెట్టి సుదర్శన్, గుండాల అంజయ్య యాదవ్ తదితరులు కోరారు.

పాత పింఛన్ విధానాన్ని అమలుచేయాలి

దేవరకొండ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాత పింఛన్ విధానాన్ని అమలుచేయాలని రిటైర్డ్ ఉద్యోగ సంఘం నియోజకవర్గ కార్యదర్శి అంకం చంద్రమౌళి, కోశాధికారి పంగునూరి లింగయ్య డిమాండ్ చేశారు. సోమవారం రిటైర్డ్ ఉద్యోగ సంఘం భవనం ఎదుట రిటైర్డ్ ఉద్యోగులు కాంట్రిబ్యూషన్ పింఛన్‌ను వ్యతిరేకించి మాట్లాడారు. ప్రభుత్వం కాంట్రిబ్యూషన్ పింఛన్ విధానాన్ని తొలగించి పాత పింఛన్ విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగ సంఘం నాయకులు పురుషోత్తం, షరీఫ్, ఐజాగ్, జంపాల యాదగిరి, వీరయ్య, సత్యం, ప్రభాకర్, పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితా నుంచి తొలగింపు రాజ్యాంగ విరుద్ధం

మిర్యాలగూడ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనడం రాజ్యాంగ వ్యతిరేకమని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రవినాయక్ అన్నారు. మిర్యాలగూడ పట్టణంలో సోమవారం ఆయన సంఘం జిల్లా అధ్యక్షుడు బానోతు నాగేశ్వరరావుతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 50 ఏళ్లుగా ఎస్టీ జాబితాలో ఉన్న లంబాడీ, గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సోయం బాబురావు, తెల్లం వెంకట్రావు డిమాండ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలి

దేవరకొండ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగె వెంకటేష్ డిమాండ్ చేశారు. దేవరకొండలో సోమవారం నిర్వహించిన సంఘ నియోజకవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఇంటర్ విద్యను అభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.8150 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఈ నెల 2వ తేదీన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నక్క గణేష్, రాజేష్, అఖిల్, అనిల్, శివరాం, ప్రశాంత్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ'తో సొంతింటి కల సాకారం

నిడమనూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ పథకంతో పేద ప్రజల సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేస్తుందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి యడవెల్లి వల్లభ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. మండలంలోని వల్లభాపురం గ్రామానికి చెందిన ఇందిరమ్మ లబ్ధిదారులకు సోమవారం వారు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఇంటి నిర్మాణాలకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగుల లింగయ్య, నాయకులు కొండా శ్రీనివాస్‌రెడ్డి, ముంగి శివమారయ్య, రవి, రామలింగయ్య, సత్యనారాయణ, రమణ పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

పెద్దవూర, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని టీఎస్‌పీఆర్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సోమవారం టీఎస్‌పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు పీఆర్‌టీయూ శ్రేణులు మండలం నంచి అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు పీఆర్‌టీయూ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ హామీ మేరకు ఓపీఎస్‌ను అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ధర్నాకు వెళ్లిన వారిలో సంఘం మండల అధ్యక్షుడు వీరారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్రాంనాయక్, నాయకులు రూపరెడ్డి, దేవేందర్‌రెడ్డి, జానారెడ్డి, వెంకట్‌రెడ్డి, కాసం శ్రీనివాస్, నరేందర్, రవి, సురేష్‌రెడ్డి, కుమార్, సీతారాం, చంద్రమౌళి, జానకిరాంరెడ్డి, శ్రీకాంత్, సంతోష్ పాల్గొన్నారు.

జానా, రఘువీర్‌ల పరామర్శ



రామిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జానా, రఘువీర్‌రెడ్డి

హాలియా, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఆయన తనయుడు ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి సోమవారం ఇటీవల మృతి చెందిన వారి సమీప బంధువు గోలి రామిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట నాయకులు కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు మేరెడ్డి వెంకట్‌రాహుల్, ఆంగోతు భగవాన్‌నాయక్, కాకునూరి నారాయణగౌడ్, కుందూరు రాంరెడ్డి, చెరుకూరు సుబ్రమణ్యం, కిరణ్, చంద్రారెడ్డి, రాజాప్రసాద్, రాజారమేష్ యాదవ్, లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, కుటుంబ సభ్యులు గోలి జగన్ పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా ఇదే చర్చ



నిడమనూరు ఎంపీడీవో కార్యాలయం.

▸▸ తొలుత పంచాయతీ ఎన్నికలా, పరిషత్ ఎన్నికలా?

▸▸ పల్లెల్లో 'స్థానిక' సందడి షురూ

▸▸ రిజర్వేషన్లపై సర్వత్రా ఆసక్తి

నిడమనూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండటంతో గ్రామాల్లో మళ్లీ ఎన్నికల సందడి మొదలైంది. పల్లెల్లో ఎక్కడ చూసినా ఎన్నికల పైనే చర్చించుకుంటున్నారు. తొలుత పంచాయతీ ఎన్నికలా లేక పరిషత్ ఎన్నికలు జరుగుతాయా? రిజర్వేషన్లపై కూడా సర్వత్రా సందిగ్ధం, ఆసక్తి నెలకొంది. ముసాయిదా ఓటరు జాబితాతో పాటు వార్డులను కూడా ఇటీవల అధికారులు గుర్తించారు. దీంతో ఈ నెలాఖరులోగా ఎన్నికలు జరగడం ఖాయంగా కనిపిస్తుంది. మండలంలో 29 గ్రామ పంచాయతీలు, 13 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనేక మంది ఆశావహులు ఏడాదిన్నర కాలంగా ఉత్సాహం చూపిస్తున్నారు. అధికార పార్టీ నాయకులు గ్రామాల్లో హడావుడి చేస్తున్నారు. దీంతో ఆశావహుల సందడి కూడా జోరుగా కనిపిస్తుంది. నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నందున స్థానిక సంస్థల్లో ఈసారి బీసీలకు మరింత ప్రాతినిధ్యం పెరగనుంది. గత ఎన్నికల్లోనే మండలంలో బీసీలు 60శాతం వరకు స్థానిక సంస్థల్లో పదవులు పొందారు. జనరల్ స్థానాల్లోనూ పోటీ చేసి అనేక చోట్ల ఎంపీటీసీలు, సర్పంచులుగా బీసీలు గెలిచారు.

మండలంలో మొత్తం 36,094 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 17,516 మంది కాగా మహిళలు 18,577 మంది ఉన్నారు. పురుషుల కంటే 1,061 ఓట్లు మహిళలవి అధికంగా ఉన్నాయి. అదేవిధంగా ఒకరు ట్రాన్స్‌జెండర్ కూడా ఉన్నారు. గతంలో నిడమనూరు ఎంపీపీ, జడ్పీటీసీ పదవులు రెండూ జనరల్ మహిళలకు రిజర్వ్ అయ్యాయి. 29 గ్రామ పంచాయతీల్లో 14 జనరల్‌కు, 8 బీసీలకు, 6 ఎస్సీలకు, ఒక పంచాయతీ ఎస్టీలకు రిజర్వ్ చేశారు. అదే విధంగా 13 ఎంపీటీసీలకు జనరల్‌కు ఏడు, బీసీలకు మూడు, ఎస్సీలకు మూడు స్థానాలు కేటాయించారు. గతంలో ఎంపీపీ పదవిని బీఆర్ఎస్ కైవసం చేసుకోగా జడ్పీటీసీ స్థానం మాత్రం కాంగ్రెస్ వశమైంది. ఎంపీటీసీల్లో బీఆర్ఎస్ 8, కాంగ్రెస్ పార్టీ 5 సీట్లు గెలుచుకుంది. అదేవిధంగా గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు 18, కాంగ్రెస్ 10 పంచాయతీలు గెలుచుకోగా నిడమనూరు మండల కేంద్రంలో మేజర్ పంచాయతీ మాత్రం ఇండిపెండెంట్ అభ్యర్థి విజయం సాధించారు. ఈసారి మెజార్టీ స్థానాలు దక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు చేస్తోంది.

మొత్తం ఓటర్లు	36,094
పురుషులు	17,516
మహిళలు	18,577
ఇతరులు	1
గ్రామ పంచాయతీలు	29
ఎంపీటీసీ స్థానాలు	13
వార్డులు	256

అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరుచేయాలి



చింతపల్లిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నారి ఐలయ్య

చింతపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య డిమాండ్ చేశారు. సోమవారం చింతపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ రమాకాంత్‌శర్మకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా నేటికీ హామీలు అమలు చేయలేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజా సమస్యలపై సీపీఎం పోరాటం చేస్తుందని అన్నారు. ఈ ధర్నాలో సీపీఎం మండల కార్యదర్శి ఉడుగుంట్ల రాములు, నాయకులు పోలే యాదయ్య, సర్దార్, జెల్లా నరసింహగౌడ్, కృష్ణయ్య, బాలయ్య, మదారు, వెంకటయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

హాలియా: హాలియా మునిసిపాలిటీ పరిధిలో 48వ సర్వే నెంబర్‌లో అనేక మంది పేదలు నివాసం ఉంటున్నారని, వారికి వెంటనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి అవుతా సైదులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలుచేయడంలో విఫలమైందని అన్నారు. మునిసిపల్ పేదలకు కూడా వంద రోజుల పథకాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ పథకాల అమలులో గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. రైతులకు సరిపడా యూరియాను అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు రెబెల్లి వెంకటేశ్వర్లు, పొదిల వెంకన్న, కోరే రమేష్, శ్రీను, నర్సింహ, వెంకటమ్మ పాల్గొన్నారు.

వంతెన ఏర్పాటయ్యేదెప్పుడో..?



రాయినిగూడెం వాగులో ప్రవహిస్తున్న వరద (ఫైల్ ఫొటో)

చింతపల్లి మండలంలోని రాయినిగూడెం, వర్కాల గ్రామాలను కలుపుతూ రోడ్డుపై నాలుగు వాగులు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు పొంగుతున్నాయి. దీంతో వరద నీరు వాగుపై నుంచి ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. వాగులో నుంచి ప్రయాణం చేయాలంటే ప్రజలు జంకుతున్నారు. ఈ రోడ్డు రహదారి నుంచి మూడు మండలాలను కలిపి లింకు రోడ్డు ఉండటం వల్ల వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. కాగా లోలెవల్ కల్వర్టు ఉండటం వల్ల వరదనీరు భారీగా ప్రవహించడం తో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి లోలెవల్ కల్వర్టును తొలగించి హైలెవల్ కల్వర్టును ఏర్పాటు చేసి సమ స్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

● ఆంధ్రజ్యోతి, చింతపల్లి.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు



నిడమనూరులో ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

● రెండు గంటలపాటు రాస్తారోకో

నిడమనూరు, మాడుగులపల్లి, పెద్దఅడిశర్లపల్లి, డిండి, హాలియా, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండల కేంద్రంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై, మాడ్గులపల్లిలో అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై సోమవారం యూరియా కోసం బైఠాయించారు. యూరియా లోడ్ వస్తుందనే ఆశతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు తెల్లవారుజామునే అధిక సంఖ్యలో సొసైటీ వద్దకు చేరుకున్నారు. నిడమనూరులో ఉదయం 7.30 నుంచి 9.30గంటల వరకు రాస్తారోకో చేశారు. యూరియాను అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఏవో మునికృష్ణయ్య, ఎస్ఐ ఉప్పు సురేష్ సిబ్బందితో వచ్చి రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. రోజు టోకెన్లు ఇచ్చి బుధవారం యూరియా రాగానే రైతులకు సక్రమంగా పంపిణీ చేస్తామని నచ్చజెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. మండలంలో 37వేల ఎకరాల్లో వరి, 1700 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. 5వేల మెట్రిక్ టన్నుల యూ రియా అవసరం కాగా ఇప్పటివరకు కేవలం 1500 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే రావడంతో తీవ్ర కొరత ఏర్పడింది. మాడ్గులపల్లి లో సుమారు 30 నిమిషాల పాటు రహదారిపై బైఠాయించటంతో పోలీసులు మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. మండలానికి ఇంకా 2వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉన్నది.

● పెద్దఅడిశర్లపల్లి మండలకేంద్రంలోని వ్యవసాయ సహకార పరపతి సంఘం ఎదుట తెల్లవారుజామున 3 గంటల నుంచి రైతులు యూరియా కోసం బారులు తీరారు. ఈ క్యూలైన్ మధ్యాహ్నం వరకు కొనసాగడంతో రైతులు లైన్‌లో నిలబడలేక చెప్పులు, పాస్‌పుస్తకాల జిరాక్స్‌పై రాళ్లు పెట్టారు. నాలుగు గంటలపాటు క్యూ కడితే రెండు బ స్తాలు మాత్రమే పంపిణీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



మాడుగులపల్లిలో ధర్నా చేస్తున్న రైతులు

● డిండి ప్రాజెక్టు పరిధిలోని 12500 ఎకరాలు ఈ వానాకాలం సాగులోకి వచ్చింది. ఇప్పటికి రెండు సొసైటీల పరిధిలో 420 టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మరో 450 మెట్రిక్ టన్నుల యూరియా కావాల్సి ఉంది.

● హాలియాలోని కొత్తపల్లి పీఏసీఎస్ వద్దకు తెల్లవారుజాము నుంచే రైతులు అధిక సంఖ్యలో యూరియా కోసం బారులుతీరారు. సొసైటీకి వచ్చిన 888బస్తాలను రైతులకు పోలీస్ సమక్షంలో ప్రతి వ్యక్తికి రెండు బస్తాల చొప్పున అందజేశారు. యూరియా వస్తద న్న రోజు కొంత మంది రైతులు రాత్రి వేళల్లో సొసైటీ వద్దనే నిద్రిస్తున్నారు.



హాలియాలో యూరియా కోసం బారులుతీరిన రైతులు

యూరియా నిల్వలు నిల్

(5వ పేజీ తరువాయి)

ముమ్మరమయ్యాయి. ఆయకట్టు కింద అత్యధికంగా వరి నాట్లు వేస్తుండటంతో రైతులకు ఎరువుల అవసరం పెరిగి, కొరత నేపథ్యంలో రోడ్డెక్కుతున్నారు.

ఎప్పటికప్పుడూ ప్రణాళికలతో ముందుకు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ఎప్పటికప్పుడూ ప్రణాళిక ప్రకారం ఎరువుల సరఫరాపై ముందుకు సాగుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కొద్ది రోజుల క్రితం 50వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తామని రాష్ట్రానికి హామీ ఇచ్చింది. అందులో జిల్లాకు 4వేల మెట్రిక్ టన్నులను కోటాగా కేటాయించారు. ప్రస్తుతం గోదాములల్లో ఎరువుల నిల్వలు లేకపోవడంతో వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడూ రోజువారీగా లేదా, మూడు రోజుల కొకసారి యూరియాను తెప్పిస్తూ రైతులకు సరఫరా చేస్తున్నారు. ఒక్కో రైతుకు బస్తా లేదా రెండు బస్తాలకు మించి యూరియా అందని పరిస్థితి నెలకొంది. దీంతో పీఏసీఎస్ కేంద్రాల వద్ద రైతులు గంటల కొద్దీ పడిగాపులు పడుతున్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొన్ని చోట్ల పోలీసుల సహకారంతో యూరియా సరఫరా చేస్తున్నారు. యూరియా కొరత తీవ్రం కావడంతో అధికారులు నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్ర : బీఆర్ఎస్

కొండమల్లేపల్లి, మిర్యాలగూడ, దేవరకొండ, డిండి, హాలియా, పెద్దఅడిశర్లపల్లి, వేములపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం కుట్ర చేస్తోందని, సీబీఐకి కాళేశ్వరం అప్పజెప్పడమంటే పూర్తిగా ప్రాజెక్టును మూసివేయడమేనని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరంలో ఎలాంటి అవినీతి జరగలేదని పేర్కొన్నారు. కమిషన్ నివేదికపై మాట్లాడేందుకు సమయం ఇవ్వకుండా ప్రభుత్వం గొంతు నొక్కే ప్రయత్నం చేస్తుందని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీ అనవసర రాద్ధాంతం చేస్తూ ప్రాజెక్టును శాశ్వతంగా మూసివేసి నది జలాలను ఆంధ్రకు తరలించేందుకు రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రాస్తారోకోతో ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు కలుగజేసుకొని బీఆర్ఎస్ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్, అభిషేక్‌నాయక్, రమావత్ దీప్లానాయక్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



హాలియా: రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్, నాయకులు

● మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే, మాజీ ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కేందుకే కాళేశ్వరంపై సీబీఐ నాటకానికి తెరతీసిందని అన్నారు. పట్టణంలో నల్లరిబ్బన్లు, కండువాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, అన్నబీమోజు నాగార్జునాచారి, ధనావత్ చిట్టిబాబునాయక్, ఎండీ మోసిన్ అలీ, ఎండీ యూసూఫ్, హతీరాంనాయక్, వీరకోటిరెడ్డి, పద్మశెట్టి కోటేశ్వరావు, బాలాజీనాయక్, రవినాయక్, శ్రీను పాల్గొన్నారు.

దేవరకొండ: కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు ప్రభుత్వం ఆమోదం తెలపడాన్ని నిరసిస్తూ దేవరకొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటనారాయణరెడ్డి, వేముల రాజు, కృష్ణ, జానీబాబా, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● డిండిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరమోని శ్రీనివాస్, బలుముల తిరుపతయ్య, పున్న లింగమయ్య, జైపాల్, గుర్రం సురేష్, ఎండి.రషీద్, కాసుల ఐలేష్, బాషిద్, గొడుగు శ్రీశైలం, మైనుద్దీన్, లక్ష్మయ్య, చంద్రయ్యగౌడ్ పాల్గొన్నారు.

● హాలియాలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు యూరియా కోసం పడుతున్న ఇబ్బందుల నుంచి దృష్టి మళ్లించడానికే రేవంత్ ప్రభుత్వం ఇలా చేస్తుందని విమర్శించారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేయగా పోలీసులు వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, వడ్డే సతీష్‌రెడ్డి, నాయకులు జటావత్ రవినాయక్, చెన్న సుందర్‌రెడ్డి, పిడిగం నాగయ్య, కామెర్ల జానయ్య, వెంకటేశం, రాంబాబు, సధాకర్, బిక్షానాయక్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.



కొండమల్లేపల్లిలో నల్ల జెండాలతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

● పెద్దఅడిశర్లపల్లిలో మండల అధ్యక్షుడు యోల్లురి వల్లపురెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు, యువజన, విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

● వేములపల్లిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగాన్ని ఆదుకునేందుకు కాళేశ్వరం ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లేనిపోని సాకులతో బీఆర్ఎస్‌ను అప్రతిష్ట పాలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిర్ర మల్లయ్యయాదవ్, కట్టా మల్లేష్‌గౌడ్, మజ్జిగపు సుధాకర్‌రెడ్డి, గౌరు శ్రీనివాస్, కాట్రగడ్డ రాజగోపాల్‌రావు, సైదిరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదానంలో పాల్గొనడం అభినందనీయం : యాదగిరి



రైస్‌మిల్లులో ఏర్పాటు చేసిన శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

హాలియా, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): యువకులు స్వచ్ఛందంగా రక్తదానంలో పాల్గొనడం అభినందనీయమని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి అన్నారు. హాలియాలోని వజ్రతేజ రైస్ క్లస్టర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో వారి తనయుడు యశ్వంత్ పెళ్లిరోజు సందర్భంగా సోమవారం నల్లగొండ రివర్ బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి సంవత్సరానికి మూడు సార్లు రక్తదానం చేయవచ్చని అన్నారు. అనేక మంది రోడ్డు ప్రమాదాలు, ఇతర కారణాల వల్ల కావాల్సిన రక్తం అందుబాటులో లేక ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువకులు చైతన్యవంతులై రక్తదానం చేయాలని సూచించారు. ఈ శిబిరంలో 103 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైద్య బృందం డాక్టర్ నులక రవీందర్‌రెడ్డి, మిల్లర్స్ తాలుకా కార్యదర్శి పేలపూడి బాలకృష్ణ, మిల్లర్లు కుక్కడపు రమేష్, చిట్టిపోలు హేమంత్, రామాంజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, కొత్తమాసు ప్రసాద్, ప్రశాంత్, మహేష్, ఈగల కొండల్, రాజేష్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన గణేష్ నిమజ్జనాలు

నాగార్జునసాగర్, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ వద్ద కృష్ణానది లో దయ్యాలగండి పుష్కర ఘాట్ వద్ద గణేష్ విగ్రహాల నిమజ్జనాలు సోమవారం ప్రారంభమయ్యాయి. నల్లగొండ, హైదరాబాద్, ఖమ్మం, హాలియాలతో పాటు సాగ ర్ పరిసర ప్రాంతంలో ఉన్న గ్రామాల నుంచి విగ్రహాలను తీసుకువచ్చి కృష్ణానది లో నిమజ్జనం చేస్తున్నారు. ఇక్కడకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా విద్యుత్, శానిటేషన్, హెల్త్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారు లు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సోమవారం 10 విగ్రహాలు నిమజ్జ నం చేసినట్లు అధికారులు తెలిపారు.

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : కొత్తలోక, వెంకటేశ్వర: సుందరకాండ రాఘవ: కూలీ, విక్రోస్: కొత్తలోక, బ్రహ్మాండ, సుందరకాండ, దేవరకొండ : మనోజ్ : వార్ 2 మైత్రి వెంకటేశ్వర : కూలీ